ఈనాడు
అనంతపురం
బుధవారం 23 ఆగస్టు 2017 16 పేజీలు

అవసరం చెట్టంత..

అందుబాటులో విత్తంత!

కావాల్సిన విత్తు: 1.12 లక్షల క్వింటాళ్లు

అందుబాటులో ఉంది: 13 వేల క్వింటాళ్లు



- ✦ మండలాల్లో మొదలైన ప్రత్యామ్నాయ విత్తు పంపిణీ
- ✦ ఉచితమని తీసుకోవడం కాదు.. సాగు చేయాల్సిందే
- ✦ లేకుంటే రికవరీ చేసేందుకు అధికారుల సన్నద్ధం...


ఈనాడు, అనంతపురం: "ఖరీఫ్‌లో వర్షాభావం వెంటాడింది. వేరుసెనగ.. మరే ఇతర పంటలు వేయలేకపోయిన రైతులకు కాసింత ఊరట కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. నూరు శాతం రాయితీపై ప్రత్యామ్నాయ విత్తు పంపిణీ ఆరంభించింది. అయితే పూర్తిస్థాయిలో విత్తు మాత్రం జిల్లాకు చేరనే లేదు. రోజుకు కొంత చొప్పున వస్తోంది. ఇప్పటి వరకు 13 వేల క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. మరో వైపు నూరు శాతం రాయితీ అంటే ఉచితంగా విత్తు ఇస్తున్నారనే ఉద్దేశంతో రైతులు విత్తు పంపిణీ కేంద్రాల వద్ద వరుస కడుతున్నారు. ఇలా ప్రత్యామ్నాయ విత్తు తీసుకెళ్లే

మిగతా 7లో ▶

చికుబుకు చికుబుకు రైలే..

స్వచ్ఛత లేనే లేదే!

- ➤ దుర్వాసన.. ఎలుకల బెడద
- ➤ పారిశుద్ధ్యం మరింత అధ్వానం
- ➤ వంటశాలలోనూ అపరిశుభ్రత



తిరుపతిలో రాత్రి 10.30 గంటలకు బయలుదేరిన రైలు మరుసటి రోజు ఉదయం 6.45కు అనంతపురం చేరుకుంటుంది. గుంతకల్లు మీదుగా బళ్లారి, అక్కడి నుంచి కదిరిదేవరపల్లికి అదేరోజు మధ్యాహ్నం 1.05 గంటలకు చేరుకుంటుంది. 20 నిమిషాల విరామం తర్వాత తిరిగి 1.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6కు తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైలు తిరిగి తిరుపతికి చేరిన తర్వాతనే బోగీలను శుభ్రం చేస్తున్నారు. కదిరిదేవరపల్లి నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులు దుర్వాసన మధ్య రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గుంతకల్లులో సమయం ఉంటే మరుగుదొడ్లు మాత్రమే ఒకటి రెండు బోగీలలో శుభ్రం చేస్తున్నారు. తిరుపతిలో ఒక పగలు నిలుపుతారు. అక్కడ మాత్రమే బోగీలను శుభ్రం చేస్తున్నారు.

అనంతపురం (రైల్వే), న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో అందరినీ భాగస్వాములను చేస్తోంది. రైల్వేశాఖ సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అయితే అధికారులు ప్లాట్‌ఫామ్‌లు, స్టేషన్ ఆవరణాన్ని మాత్రమే శుభ్రం చేస్తున్నారు. రైళ్లపై ఏమాత్రం దృష్టి సారించడం లేదు. బోగీల్లో శుభ్రతపై చిత్తశుద్ధి కొరవడింది. ఫలితంగా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

రైళ్లలో అపరిశుభ్రత నెలకొంది.. ఎలుకలు పాగా వేశాయి.. బ్యాగుల్లో తినుబండారాలు ఉన్నాయంటే ఇక అంతే.. గమ్యస్థానానికి చేరుకునేలోపు బ్యాగుకు రంధ్రాలు కనిపిస్తాయి. సగం రైళ్లలో దుర్వాసన తారాస్థాయికి చేరుకుంటోంది. ఆఖరి స్టేషన్‌లో కనీసం 8 గంటలైనా ఆపితేనే రైళ్లలో కాస్తోకూస్తో శుభ్రత కనిపిస్తుంది. ఆఖరి స్టేషన్ చేరిన

మిగతా 7లో ▶

ఐదుగురిపై వేటు 2లో...

విలీనం.. కష్టాలు సజీవం 11లో...

మట్టితో చేద్దాం.. మనసుతో పూజిద్దాం 16లో...

జలస్తంభన



తుంగభద్ర జలాశయంలో నీటి పరవళ్లు

- చివరి నిమిషంలో ఆగిన నీటి విడుదల
- బళ్లారి ప్రాంతానికి నీరు వద్దని మెలిక

ఈనాడు - అనంతపురం: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ కాల్వకు మంగళవారం నుంచి నీటి విడుదల ఆరంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో ఈ నిర్ణయం వాయిదా పడింది. వాస్తవానికి హెచ్చెల్సీ పరిధిలో అనంతతోపాటు, ఎగువన బళ్లారి ప్రాంతానికి కూడా కలిపి కొంత నీటిని విడుదల చేయాలని భావించగా, బళ్లారి ప్రాంత ఇంజినీర్లు తమకు అప్పుడే నీరొద్దని చెప్పారు. దీంతో కేవలం అనంతకు మాత్రమే నీటిని విడుదల చేస్తామని తుంగభద్ర జలాశయ ఇంజినీర్లు పేర్కొనగా, అలా వద్దని అనంతపురం హెచ్చెల్సీ ఇంజినీర్లు సమాచారం ఇచ్చారు. ఈ ఉత్కంఠ పరిణామాల నేపథ్యంలో ప్రస్తుతానికి నీటి విడుదల ఆగింది.

తాగునీటి అవసరాల నిమిత్తం తుంగభద్ర జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని కలెక్టర్, హెచ్చెల్సీ ఇంజినీర్లు తుంగభద్ర అధికారులను కొద్ది రోజుల కిందట కోరారు. కేవలం అనంతకు మాత్రమే కాకుండా ఎగువన బళ్లారి ప్రాంతానికి కూడా కొంత నీటిని విడుదల చేయాలని సూచించారు. ఇలా ఎగువన బళ్లారి ప్రాంతానికి 200-300 క్యూసెక్కులు, మన జిల్లాకు వెయ్యి క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు అంతా సిద్ధమైంది. ఇక్కడి అధికారులు కూడా ఏర్పాట్లు చేసుకొని, ఏప రోజుల్లో ఏప

మిగతా 7లో ▶

ఐదుగురిపై వేటు!

- మరుగుదొడ్ల నిర్మాణంలో చివరి స్థానం
- అధికారుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో జిల్లా వెనుకపడటం.. నిర్దేశించిన లక్ష్యంలో మూడింట కేవలం ఒక వంతు మాత్రమే నిర్మాణం పూర్తి కావడంపై కలెక్టర్ వీరపాండియన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటి నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐదుగురు అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఒక్కసారిగా కలెక్టర్ ఐదుగురిపై వేటు వేయడం సంచలనంగా మారింది.

జిల్లాలోని అన్ని మండలాల్లో కలిపి 1.53 లక్షల మరగుదొడ్లను నిర్మించేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే ఇప్పటి వరకు దాదాపు 53 వేల మరుగుదొడ్లు మాత్రమే పూర్తయ్యాయి. కలెక్టర్ వీరపాండియన్ ఇక్కడ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ప్రతి పథకానికి సంబంధించి ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు. పథకాల అమలులో జిల్లా ముందుండాలని చెబుతున్నారు. అయినా సరే వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో జిల్లా పూర్తిగా వెనుకపడింది. దేశంలోని 681 జిల్లాల్లో ఈ పథకం అమలు చేస్తుండగా.. అందులో మన జిల్లా 637వ స్థానంలో నిలిచింది. అలాగే రాష్ట్రంలోని 13 జిల్లాలకుగాను చివరి స్థానం దక్కించుకుంది. దీనిపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిర్లక్ష్యం చేస్తే సహించను

'ఉద్యోగులు ఎవరైనా సరే.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపితే సహించేది లేదని కలెక్టర్ వీరపాండియన్ హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐదుగురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో అగళి, పెనుకొండ మండలాల నీటి సరఫరా విభాగం ఏఈలు సంతోష్, శైలజా, హిందూపురం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, మడకశిర తహసీల్దారు హరిలాల్‌నాయక్, పరిగి ఈవోఆర్డీ సుభాషిణమ్మను సస్పెండ్ చేయాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అగళి, పెనుకొండ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఇద్దరు గత పది రోజులుగా విధులకు గైర్హాజరు కావడం, హిందూపురం ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, మడకశిర తహసీల్దారు, ఈవోఆర్డీ వీడియో కాన్ఫరెన్సుకు గైర్హాజరు కావడంతో కలెక్టర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ పథకాల అమలుపై మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల అధికారులతో కలెక్టరు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1.55 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యంగా కాగా.. అందులో 52,600 మాత్రమే పూర్తి చేసి జియోట్యాగింగ్ చేశారన్నారు. మిగిలిన వాటిని సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి పథకం కింద 5 వేల ఎకరాల్లో పండ్లతోటలు పెంచడానికి కృషి చేయాలన్నారు. లక్ష నీటికుంటలు లక్ష్యం కాగా అందులో 65 వేలు నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. క్రీడా మైదానాలు, వర్మీకంపోస్టు యూనిట్లు, శ్మశాన వాటిక నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

దుర్వినియోగం చేస్తే రాయితీలు రావు...

జిల్లాలో ప్రత్యామ్నాయ విత్తనాలను అర్హులైన రైతులకు మాత్రమే పంపిణీ చేయాలని ఆదేశించారు. విత్తనాలు తీసుకున్న రైతులు కచ్చితంగా సాగు చేయాలన్నారు. విత్తనాలను దుర్వినియోగం చేస్తే రాయితీ తిరిగి వసూలు చేస్తామన్నారు. సూక్ష్మపోషకాలను అర్హులైన రైతులకే పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ వీసీలో జేసీ రమామణి, రెండో జేసీ సయ్యద్ ఖాజా, పీడీ వెంకటేశ్వర్లు, జేడీఏ శ్రీరామ్మూర్తి, ఎస్ఈ హరేరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



వెంకటేశులు

మాల్యం (కణేకల్లు), న్యూస్‌టుడే: బోరులో నీరు పడలేదన్న మనస్తాపంతో దాని కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మండలంలోని మాల్యం గ్రామానికి చెందిన రైతు బోయ వెంకటేశులు(60) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు, రెవెన్యూ అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని మాల్యం గ్రామానికి చెందిన వెంకటేసులుకు ఐదుగురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కొన్నేళ్లుగా వేదావతి హగరిలో ఐదు ఎకరాల పోరంబోకు భూమిని సాగు చేసుకుంటున్నాడు. ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్లు, కుటుంబ పోషణ, పొలంలో బోరు వేసేందుకు రూ.7 లక్షల వరకు అప్పు చేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఇటీవల అల్లుడు చనిపోవటంతో కూతురు పుట్టింట్లో ఉంటోంది. దీంతో తీవ్ర మనోవేదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. చేసిన అప్పులు తీర్చే క్రమంలో మరికొంత అప్పుచేసి, ఇటీవల తనకున్న పొలంలో మరో బోరు వేసినా నీరు పడలేదు. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో ఈనెల 20న మధ్యాహ్నం గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుప్పకూలి కింద పడిపోవడంతో అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి హుటాహుటిన కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. రెండు రోజులుగా కోలుకుంటూ పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య బోయ యల్లమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యువరాజు వివరించారు.

భూ వివాదంపై ఎస్పీకి ఫిర్యాదు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: భూ వివాదంపై పోలీసు అధికారులు వివక్షతతో వ్యవహరిస్తున్నారని బాధితురాలు లలితాబాయి మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్‌కు విన్నవించారు. కదిరి మండలం మూర్తిపల్లి గ్రామంలో తన వ్యవసాయ భూమిపై వివాదం నెలకొందన్నారు. రికార్డుల మేరకు న్యాయం చేయకపోగా కొందరు పోలీసు అధికారులు భూ ఆక్రమణదారులకు సహకరిస్తున్నారని బాధితురాలు వాపోయారు. విలువైన భూమి కావడంతో కాజేయడానికి కొందరు రౌడీషీటర్లు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఈ వివాదంపై పోలీసులు తమపైనే కేసులు నమోదు చేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారన్నారు. విచారణ చేపట్టి పోలీసుల అత్యుత్సాహంపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

కార్పొరేటర్ మృతి



నరసింహులు(పాతచిత్రం)

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: నగరపాలకవర్గంలోని కార్పొరేటర్ నరసింహులు గుండెపోటుతో మంగళవారం మరణించారు. 34వ డివిజన్‌కి ప్రాతినిథ్యం వహిస్తున్న నరసింహులు మృతి చెందడంపై పాలకవర్గం సంతాపం వ్యక్తం చేసింది. కృపానందనగర్‌లో నివాసముంటున్న ఆయనకు మధ్యాహ్నం సమయంలో గుండెపోటు రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధరించారు. మేయర్ స్వరూప, ఉప మేయర్ గంపన్న, కమిషనర్ పీవీవీఎస్ మూర్తి, కార్పొరేటర్లు సరిపూటిరమణ, హేమలత, నటేష్‌చౌదరి, రహమత్‌బి తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలతో నివాళులర్పించారు.

సమ్మె విరమణ

అనంతపురం (అరవిందనగర్): గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మె విరమించారు. దిల్లీలో కమ్యూనికేషన్ల మంత్రి కార్యదర్శి, డిప్యూటీ డైరెక్టరుతో జాతీయ కమిటీ సభ్యులు మహదేవయ్య తదితరులు మంగళవారం రాత్రి జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రిష్ణయ్య యాదవ్ తెలిపారు. బుధవారం యథావిధిగా విధులకు హాజరు కావాలని ఆయన జీడీఎస్ ఉద్యోగులను కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం(రైల్వే), న్యూస్‌టుడే: రాజీవ్‌కాలనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో ఆచూకీ కనుగొనలేకపోయారు. నీలం రంగు జీన్స్ ఫ్యాంటు, తెల్ల టీషర్టు ధరించాడు. మృతుడి బంధువులు పూర్తి వివరాల కోసం రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దుర్మరణం

ముదిగుబ్బ (బత్తలపల్లి): ఇసుకను తేవడానికి వెళ్లిన అన్వర్ బాషా(22) దుర్మరణం పాలైన ఘటన మొగలచెట్లపల్లి సమీపంలోని చిత్రావతి నదిలో చోటుచేసుకొంది. మంగళవారం ముదిగుబ్బ ఏఎస్సై భాస్కర్‌రాజు కథనం మేరకు.. ధర్మవరం పట్టణానికి చెందిన నడిమిమజీద్ మహబుబ్‌బాషా కుమారుడు అన్వర్‌బాషాకు ట్రాక్టర్ ఉంది. ట్రాక్టర్ ద్వారా చిత్రావతి నుంచి ఇసుకను పట్టణానికి తరలించి జీవనోపాధి పొందుతున్నాడు. అయితే సోమవారం సాయంత్రం ఇసుకను తేవడానికి బాషాతోపాటు మరో నలుగురు కూడా చిత్రావతికి వెళ్లారు. అనంతరం ట్రాక్టర్‌కు ఇసుకను నింపి వచ్చే సమయంలో ట్రాక్టర్ ఇసుకలో ఇరుక్కుపోయింది. మరో ట్రాక్టర్ డ్రైవర్ శివ సహకారంతో వాహనం బయటకు తెచ్చే సమయంలో మలుపులో వేగంగా వస్తుండటంతో వెనుక ట్రాలీలో కూర్చున్న అన్వర్ బాషా కింద పడిపోయాడు. యువకుడిపై ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. అన్వర్ అన్న మహమ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం దుకాణాలను తొలగించాల్సిందే

కోవూరునగర్(అనంతపురం), న్యూస్‌టుడే: జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాల్సిందేనని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, సావిత్రి తెలిపారు. మంగళవారం అనంతపురంలోని ఐద్వా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇళ్లమధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని ప్రధాన కూడళ్లలో రోడ్డు పక్కన వెలిశాయన్నారు. మహిళలు అటువైపు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మద్యం మత్తులో దాడులు పెరుగుతున్నాయన్నారు. గొలుసు, రోడ్డుపక్కన ఉన్న దుకాణాలను తొలగించాలని కోరుతూ సెప్టెంబరు 1 నుంచి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

24న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు సీఈవో సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే క్విట్ ఇండియా ఉద్యమం 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు 'సంకల్ప్ పర్వ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డీపీఆర్‌సీ భవనంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి జడ్పీటీసీ సభ్యులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చోరుడి అరెస్టు

6 తులాల బంగారం స్వాధీనం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడే దొంగను అనంత సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. రెండో నగర ఠాణాలో మంగళవారం ఏర్పాటు చేసి సమావేశంలో డీఎస్పీలు మల్లికార్జునవర్మ, నాగసుబ్బన్న వివరాలు వెల్లడించారు. నగరంలో ఇటీవల చోటు చేసుకున్న దొంగతనాల కేసులపై సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం విద్యుత్తునగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న చోరుడు మోహన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 6 తులాలు బంగారు ఆభరణాలు, 16 తులాలు వెండి నగలు, ఒక కెమెరా, ఫోను, రెండు వాచీలను స్వాధీనం చేసుకున్నారు.

నాలుగేళ్లు జైలులో..

కడప జిల్లా వనిపెంటకు చెందిన మోహన్ 1994 నుంచి దొంగతనాల బాట పట్టాడు. అప్పటి నుంచి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 8 చోరీలకు పాల్పడ్డాడు. 1994 అనంతపురంలో దోపిడీ కేసులో నిందితుడికి రెండేళ్లు జైలుశిక్ష పడింది. శిక్ష అనుభవించి బయటికి వచ్చాక, 2015లో కడప జిల్లా రాజంపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడి ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాడు. 2016లో చిత్తూరు జిల్లా మొలకలచెరువు పోలీసు స్టేషన్ పరిధిలోనూ దొంగతనానికి పాల్పడి 11 నెలలు జైలు శిక్ష అనుభవించాడు. ఇలా నాలుగేళ్లపాటు వివిధ జైళ్లలో ఉన్నాడు. అయినా తీరు మారలేదు. తిరిగి చోరీల పరంపర సాగించాడు. ఈ ఏడాది అరవింద్‌నగర్, సాయినగర్, ఆదర్శనగర్, మారుతీనగర్, మల్లేశ్వరి రోడ్డులలో తాళం వేసిన ఇళ్లలోకి చొరబడి బంగారం, వెండి నగలు అపహరించాడు. నిందితుడు ప్రస్తుతం రాప్తాడు ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్నాడు. సమాచారం మేరకు నిందితుడిని సీసీఎస్, రెండో నగర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ఇస్మాయిల్, ఎస్సై శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది వెంకటేశులు, గిరి, భాస్కర్, కిరణ్, ప్రభాకర, ఆసిఫ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీలు మల్లికార్జునవర్మ, నాగసుబ్బన్న

చికెన్ ధరలు

బ్రాయిలర్ - కేజీ

కోడిమాంసం -	రూ. 140
కోడిమాంసం(స్కిన్‌లెస్) -	రూ.170
బోన్‌లెస్ -	రూ.300
హోల్‌సేల్ లైవ్ -	రూ 74
నాటుకోడి (లైవ్) -	రూ.330
నాటుకోడి మాంసం -	రూ.350

మటన్ ధరలు

పొట్టేలు మాంసం- కేజీ రూ.440

గొర్రె మాంసం- కేజీ రూ.380

చేపలు ధరలు

సాధారణ చేపలు రూ.120

కట్ల రూహు చేపలు రూ.130

బాంగ్డా చేపలు- రూ.200

బోన్‌లెస్ చేపలు- రూ.220

చిన్న టైగర్ రొయ్యలు- రూ.240

పీతలు - రూ.170

కోడిగుడ్లు

డజను గుడ్లు(12) - రూ.52

హోల్‌సేల్(100) - రూ.400

మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు

హిందూపురం, (న్యూస్‌టుడే):

రకము:	బైవోల్టిన్	క్రాస్‌బీడింగ్ (సిబి)
కనిష్ఠధర:	302.00	275.00
గరిష్ఠ ధర:	478.00	395.00
సగటు ధర:	393.00	460.00

తెరపై ఈనాడు

అనంతపురం

- గంగ... లై
- గౌరి.... ఫిదా
- గాయత్రి.. 1947 ఇండిపెండెన్స్ డే సపరేషన్
- గౌతమి... గౌతమ్‌నంద
- త్రివేణి... ఆనందో బ్రహ్మ
- తరంగిణి... నక్షత్రం
- తేజస్విని... ప్రతిక్షణం
- శాంతి... నేనే రాజు నేనే మంత్రి
- సుధ.. జయ జానకి నాయక
- స్వప్న... గజ్జల గుర్రం
- ఎస్వీ సినిమ్యాక్స్.. జయ జానకి నాయక
- నీలిమ... రారండోయ్ వేడుక చూద్దాం

ఆశ చావదు.. సొమ్ము చేతికి రాదు



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు

☛ అందని పంటల బీమా..పెట్టుబడి రాయితీ ☛ నల్లచెరువు...ఎన్పీకుంట.. ఓడీచెరువు రైతుల ఊగిసలాట ☛ వాయిదాలతో తప్పించుకుంటున్న అధికారులు

పరిశీలన

కదిరి, నంబులపూలకుంట, ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే

పెడతారంటే ఆశ.. కొడతారంటే భయం అన్న చందంగా వేరుసెనగ రైతుల పరిస్థితి తయారైంది. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించనట్లు ఏళ్లుగా వరస నష్టాలతో తల్లడిల్లుతున్న వేరుసెనగ రైతులకు ప్రకటించిన పెట్టుబడి రాయితీ, వాతావరణ బీమాల పంపిణీ తీరు తయారైంది. వ్యవసాయశాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో దొర్లిన తప్పులతో మంజూరైన సొమ్ములో హెచ్చుతగ్గులతో ఏకంగా ఖాతాల లావాదేవీలనే నిలుపుదల చేశారు. మరికొందరు సాగుదారులు పంటనష్టపోయినా రాయితీ రాక ప్రభుత్వ సాయం చేతికందకుండా ఉంది. పెట్టుబడి రాయితీ, బీమా సొమ్ము రాదనుకునేందుకు సొమ్ము ఖాతాల్లో ఉంది. అలాగని చేతికి తీసుకుందామంటే పొరపాట్ల సవరణకు ఆంక్షలు అడ్డొస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ భూవిస్తీర్ణ పత్రాలను చేతపట్టుకుని కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు సత్వర చర్యలతో ప్రభుత్వ మంజూరు సాయం రైతుల చేతికందేలా చర్యలు చేపట్టి ఊరట కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆశ..నిరాశల ఊగిసలాట

పంట నష్టపోయిన ఫలితానికి పెట్టుబడి రాయితీ, బీమా సొమ్ము వచ్చిందన్న ఆశ... చేతికందటానికి అవాంతరాలతో నిరాశలతో ఊగిసలాడాల్సి వస్తోందని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు నెలన్నర క్రితం మంజూరైన పెట్టుబడి రాయితీ తకతారు నేటి తెగని వైనంగా మారింది. రాయితీ పొరపాట్లను సరిదిద్దేందుకు, జాబితాలో పేర్లు లేని రైతులకు చోటు కల్పించేందుకు వ్యవసాయ అధికారులు పలుమార్లు కసరత్తు చేశారు. అయినా కొలిక్కిరాకపోవటంతో అన్నదాతకు ఎదురుచూపులు తప్పటం లేదు. ఎన్పీంకుంట మండలంలోని ఎన్పీకుంట, రెక్కమానుల్లోని గ్రామీణ బ్యాంకుల్లో 95 మంది రైతులకు అందాల్సిన పెట్టుబడి రాయితీ మిస్‌మ్యాచింగ్ పేరుతో రూ.16 లక్షలు నిలుపుదల చేశారు. ఓబుళదేరవచెరువు మండలంలో 200 మంది రైతుల ఖాతాలో జమచేసిన పెట్టుబడి రాయితీ హెచ్చుతగ్గులతో రూ.50 లక్షల నగదు డ్రా చేయకుండా ఆపేశారు. దీంతో పాటు ఇదే మండలంలోని ఇనగలూరులో 178మంది, కొండకమర్లలో 150మంది రైతులకు పెట్టుబడి రాయితీ జాబితాలో ఆలస్యంగా అవకాశం కల్పించారు. వీరందరికీ రూ.3.06 కోట్లు అందాల్సి ఉంది.

నల్లచెరువు రైతులకు బీమా కల్పించని ధీమా

పంట పోయినా బీమాతోనైనా ధీమా దొరుకుందని భావించిన రైతులకు ఆవేదనే మిగిలింది. నల్లచెరువు మండలంలోని 3179 మంది వేరుసెనగ రైతులకు ప్రభుత్వం రూ.4.42 కోట్ల పైచిలుకు వాతావరణ బీమా మంజూరైంది. బీమా కంపెనీ చేసిన పొరపాట్లతో రైతు ఖాతాలకు చేరిన సొమ్ము చేతికందకుండా ఉంది. మండలంలోని రైతులకు ఎకరాకు రూ.5200 బీమా ప్రకటించారు. అయితే రైతు ఖాతాలకు మాత్రం కేవలం ఎకరాకు సుమారు రూ.1700 మాత్రమే జమ చేశారు. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. తాము చెల్లించిన ప్రీమియానికి మంజూరు చేసిన సొమ్ములో కోతలు ఎందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బ్యాంకు అధికారులు తమకు అందిన జాబితా మేరకు సొమ్ములను ఖాతాలకు జమచేశామని పేర్కొంటున్నారు.

త్వరలో పంపిణీ చేస్తాం

నల్లచెరువు రైతులకు అందాల్సిన బీమా విషయంలో బీమా కంపెనీ వల్ల కొంత పొరపాట్లు దొర్లాయి. ఈ విషయాన్ని తమ బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బీమా కంపెనీతో మాట్లాడుతున్నాం. సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నాం. త్వరలో బీమాసొమ్ము రైతులకు అందేలా చూస్తాం. **- శ్రీరంగన్న, గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ మేనేజర్**

వారంలో పెట్టుబడి రాయితీ

ఓబుళదేవరచెరువు మండలంలో పెట్టుబడి రాయితీ జాబితాలో జరిగిన మిస్‌మ్యాచింగ్, రాయితీ మంజూరు రైతుల వివరాలను ఇప్పటికే ముదిగుబ్బ, కదిరి సబ్‌ట్రెజరీలకు పంపాం. వారం రోజుల్లో సొమ్ము బ్యాంకు ఖాతాలకు చేరుతుంది. ఖాతాలకు వచ్చిన వెంటనే రైతులు డ్రాచేసుకునే అవకాశం కల్పిస్తాం. **- రామసురేష్, వ్యవసాయ సహాయ సంచాలకుడు**

బీమా రూ.3379 జమ చేశారు



నాకు నల్లచెరువులో రెండెకరాల పొలం ఉంది. ప్రభుత్వం ఎకరాకు రూ.5200 పంట బీమా మంజూరు చేసింది. అయితే నా బ్యాంకు ఖాతాకు రూ.3379 మాత్రమే జమ చేశారు. ఎకరాకు రావాల్సి సొమ్ము దక్కలేదు. బ్యాంకు అధికారులు మాత్రం మా తప్పేమీ లేదని తప్పించుకుంటున్నారు. మాకు రావాల్సిన సొమ్ము విషయం ఎవరిని అడగాలో అర్థం కాలేదు. **- షఫీ, నల్లచెరువు**

ప్రదక్షిణలే మిగుల్తున్నాయి



మాది ఓడీచెర్వు మండలం గాజుకుంటపల్లి. నేను మూడున్నర ఎకరాల్లో వేరుసెనగ సాగు చేశాను. ప్రభుత్వం పెట్టుబడి రాయితీ మంజూరు చేసిందంటే సంబరపడ్డాను. జాబితాలో చూస్తే పేరు లేదు. తర్వాత నాలుగు సార్లు చుట్టూ తిరిగి ధ్రువపత్రాలిచ్చి జాబితాలో పేరు రాయించాను. త్వరలో ఇస్తామని అధికారులు అంటున్నారు. ఎప్పటికి చేతికందుతుందో అర్థం కాలేదు.**: గంగిరెడ్డి, గాజుకుంటపల్లి**

నాఖాతా ఎప్పుడు ఇడుస్తారో



నష్టపోయిన వేరుసెనగ పంటకు ప్రభుత్వం పెట్టుబడి రాయితీ మంజూరు చేయటంతో సంబరపడ్డా. అయితే నా ఖాతాకు రూ.43వేలు జమచేశారు. దీంతో రావాల్సిన మొత్తం కంటే ఎక్కువ వేశామని ఖాతా హోల్డ్‌లో పెట్టారు. సుమారు రెండు నెలలు కావస్తోంది. ఇప్పటికీ ఖాతాలో సొమ్ము తీసుకోలేని స్థితి. అవసరాలు తీరని దుస్థితి.
- లక్ష్మయ్య, వడ్డిపల్లి

అన్వేషణ ముగిసింది.. ఉత్కంఠ మిగిలింది!

ఉపకులపతి ఎంపిక కొలిక్కి

జేఎన్‌టీయూ: జేఎన్‌టీయూ ఉపకులపతి ఎంపిక కొలిక్కి వచ్చింది. త్వరలోనే ప్రక్రియ పూర్తి కానుంది. జేఎన్‌టీయూ అన్వేషణ కమిటీ (సెర్చ్ కమిటీ) సమావేశం మంగళవారం విజయవాడలో నిర్వహించారు. ఉపకులపతిగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 43 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించిన కమిటీ సభ్యులు ముగ్గురి పేర్లను సూచించారు. వారి పేర్లను షీల్డు కవర్లో ఉంచి ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శికి అందజేశారు. ఆ ముగ్గురు పేర్లు ముఖ్యమంత్రికి తెలియజేశారు. సంబంధిత దస్త్రం ఆమోదం కోసం గవర్నర్ వద్దకు వెళుతుంది. గవర్నర్ ఆమోదం పొందిన అనంతరం ఉపకులపతి పేరు వెల్లడికానుంది. సెప్టెంబరు మొదటి వారంలో కొత్త ఉపకులపతి నియామకం జరిగే అవకాశం ఉంది. కమిటీ సభ్యులైన ఉన్నత విద్య కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, యూజీసీ ప్రతినిధి షాహీద్ జమీల్, వర్సిటీ ప్రతినిధి రామచంద్రరాజు పాల్గొన్నారు.

బ్యాంకుల విలీనం తగదు

అనంతపురం (అరవిందనగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేట్ పరం చేయవద్దని బ్యాంకు ఉద్యోగుల జిల్లా సమన్వయ కమిటీ అధ్యక్షుడు రుష్యేంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బ్యాంకులను విలీనం చేయకూడదని, కార్పొరేట్ సంస్థలు తీసుకున్న రుణాలు మాఫీ చేయవద్దని, ఎగవేత సంస్థలపై కేసులు నమోదు చేయాలన్న డిమాండ్లతో యూఎఫ్‌బీయూ, ఏఐబీఓసీ, ఏఐబీఈఏ, ఎన్‌ఓబీడబ్ల్యూ ఆధ్వర్యంలో మంగళవారం సమ్మె చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకుల నుంచి రూ.లక్షల కోట్లు రుణాలు తీసుకుని, చెల్లించకుండా తిరుగుతున్న కార్పొరేట్ సంస్థలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సొమ్మును వసూలు చేసి దేశ ఆర్థికాభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించారు. కమిటీ కార్యదర్శి మున్వర్‌బాషా, వీరభద్రారెడ్డి మాట్లాడుతూ బ్యాంకులను బలోపేతం చేయాలని కోరారు. సేవా రుసుం పేరుతో ప్రజలపై భారం పడకుండా చూడాలన్నారు. బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేసి, ఉద్యోగులపై పనిభారం తొలగించాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ సవరించాలన్నారు. ఉద్యోగులు, నాయకులు చంద్రశేఖర్, రఘురాం యాదవ్, రఘునాథరెడ్డి, అరుణ్‌బాబు, శివారెడ్డి, మురళీకృష్ణ, దినకర్, లోకనాథ్, కుమార్, చంద్రమోహన్, లక్ష్మిదేవి, అరుణ, క్రాంతి, చరణ్, నాగరాజరావు, శ్రీకాంత్, రమేష్, సీఐటీయూ నాయకుడు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న రుష్యేంద్రబాబు తదితరులు

డెంగీ జ్వరాన్ని పట్టించుకోరా?



సమీక్షిస్తున్న అదనపు డైరెక్టర్ డాక్టర్ గీతాప్రసాదిని

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: 'జిల్లాలో డెంగీ, మలేరియా ప్రబలుతోంది. చాలామంది బాధితులుగా మారారు. తాను కూడా కొన్ని ప్రాంతాలను తిరిగా. డెంగీ జ్వరం ఉన్నట్లు గుర్తించా. ఇన్నాళ్లూ మీరేం చేస్తున్నారు.. బాధ్యత లేదా'.. అంటూ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకురాలు డాక్టర్ గీతాప్రసాదిని అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో కార్యక్రమ అధికారులతో(పీఓ) సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలపై ఆరా తీశారు. 108, 102 వైద్య సేవలు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, చంద్రన్న వైద్య చికిత్స, ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలపై సమీక్షించారు. డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలపై చర్చించారు. జిల్లాలో డెంగీ జ్వరం ఎక్కువ ఉంది. గణాంకాలను సక్రమంగా నమోదు చేయడం లేదు. ఎందుకిలా చేస్తున్నారంటూ అక్కడే ఉన్న డీఎంఓ దోసారెడ్డిని ప్రశ్నించారు. జ్వరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు. మీ పనితీరు బాగాలేదంటూ ఆగ్రహించారు. ఇటీవల ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల పనితీరు కూడా సరిగా లేదన్నారు. తట్టు, రుబెల్లా టీకా నిర్వహణలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లాలోని 12 ఆరోగ్య ఉప కేంద్రాలను పీహెచ్‌సీలుగా ఉన్నతీకరిస్తాం. దీనికి తగిన కార్యాచరణ ప్రణాళిక పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, అదనపు డీఎంహెచ్‌ఓ(ఏఎల్) డాక్టర్ అనిల్‌కుమార్, డీఐఓ డాక్టర్ పురుషోత్తం, ఉప వైద్యాధికారులు యుగంధర్, వెంకటేశ్వర్‌రావు, పీఓ డీటీటీ డాక్టర్ సుజాత, డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ రితేష్ బజాజ్, ఐడీఎస్పీ రామకృష్ణ, సంచార వైద్య చికిత్స వరప్రసాద్, ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల ప్రతినిధి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు సమాచారం ఇస్తారా

'మీరు చెబుతున్న గణాంకాల్లో చాలా తేడాలు ఉన్నాయి. ఎందుకు ఇలా చేస్తున్నారు. మీ లెక్కలతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వివరాలు పంపని పీహెచ్‌సీల సిబ్బందికి మెమోలు పంపండి'.. . అంటూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. పలు ప్రగతి పాచికలను ఆరా తీశారు. కుటుంబ నియంత్రణ(కు.ని.) వివరాలు పంపలేదు. చాలా పీహెచ్‌సీల నుంచి సున్నాలు ఉన్నాయి. ఆ వివరాలు పంపితే నా ఉద్యోగం ఊడుతుందని మండిపడ్డారు. గోరంట్ల, నీలకంఠాపురం, కదిరేపల్లి, గుడిబండ, హేమావతి, అమరాపురం, అగళి సిబ్బందికి మెమోలు ఇవ్వాలని ఆయన సూచించారు.

హిందూపురం

30న డీఫార్మసీ విద్యార్థులకు వెబ్ కౌన్సెలింగ్

హిందూపురంఅర్బన్,న్యూస్‌టుడే: డిఫార్మసీ విద్యార్థులకు 30న కర్నూలులోని పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు తెలిపారు. హాజరైయ్యే విద్యార్థులు ర్యాంకు కార్డులు, పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కులజాబితా, విద్య, ఆదాయ, కుల, బదిలీ, ఆధార్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.వెయ్యి, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.500 ప్రాసెసింగ్ రుసుము చెల్లించాలన్నారు.



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఉపాధ్యాయుల కృషితో పాఠశాలల అభివృద్ధి

చౌళూరు(హిందూపురం గ్రామీణం), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల కృషితోనే పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతి సాధ్యమవుతుందని చౌళూరు పంచాయతీ సర్పంచి పద్మావతమ్మ పేర్కొన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయిని ఎ.అనూరాధ అధ్యక్షతన మంగళవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేశారని మాజీ సర్పంచి న్యాతప్ప అన్నారు. ప్రధానోపాధ్యాయిని నాగమణి, ఉపాధ్యాయులు రంగధామరెడ్డి, హితేంద్ర, రామమూర్తి, జె.వి.ప్రసాద్,సత్యనారాయణ, కళ్యాణీ, మహంతేష్, మనోహర్, సుగుణ, అన్నపూర్ణ, పీఈటీ సావిత్రి, గుమాస్తా విమలమ్మ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రంగనాథమ్‌ను పూలమాలలతో సన్మానించారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకొందాం

హిందూపురం, న్యూస్‌టుడే: గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకొనేందుకు అందరూ సహకరించాలని డీఎస్పీ కరీముల్లా షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టణంలోని ఉత్సవ విగ్రహాల కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం అందించి అనుమతి పొందాలన్నారు. కొలనువద్ద నిమజ్జనానికి అవసరమైన నీళ్లు అందుబాటులో ఉండేలా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణంలో విద్యుత్తు తీగలతో సమస్య తలెత్తకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను కోరారు. ప్రతి విగ్రహానికి ఇద్దరు పోలీసులను ఏర్పాటు చేస్తామన్నారు. 31న నిమజ్జనం ఉంటుందని, ఆ రోజు ఉదయం 9 గంటలకే విగ్రహాల తరలింపు మొదలవ్వాలన్నారు. ట్రాక్టర్లలో 12 ఏళ్ల లోపువారిని కూర్చోనివ్వకూడదని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జెపికె రాము, జేఈ వెంకటస్వామి, రాయల్‌గోపాల్, వరప్రసాద్, డీఈ రమేష్‌కుమార్, సీఐలు ఇదురుబాషా, మధుభూషన్, పట్టణ ప్రముఖులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు పేరు తీసుకురావాలి

కోడూరు(చిలమత్తూరు): మండల పరిధిలోని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళుతున్న 11 మంది ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నౌజియాభాను, జడ్పీటీసీ లక్ష్మీనారాయణరెడ్డి ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాలకు ఉపాధ్యాయులు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. విద్యార్థుల్లో దాగా ఉన్న ప్రతిభను వెలికితీశారన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు ఈశ్వర్‌రెడ్డి, దేమరాజ్, గీత, సుధ, శ్రీవాణి, విజయ, సంతోషిణి, లక్ష్మినారాయణ, మనోహర్, విజయమ్మ, రాంప్రసాద్ బదిలీ అయినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రవీణ్, మాజీ సర్పంచి అశ్వర్థప్ప, తెదేపా నాయకులు అన్వర్, గాజులకిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించండి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి ఏడో రోజుకు చేరుకొంది. సంఘం ప్రతినిధులు ప్రభాకర్, నరసింహులు తదితరులు మాట్లాడుతూ జీడీఎస్ కమిటీ నివేదికను అమలుచేయాలని, దిల్లీ, మద్రాస్ న్యాయస్థానాల తీర్పు మేరకు గ్రామీణ తపాలా ఉద్యోగులకు పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

నేరాల నివారణే లక్ష్యం

☛ ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

హిందూపురం, న్యూస్‌టుడే: సాంకేతిక పద్ధతులు అందిపుచ్చుకొని నేరాల నివారణే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు పెనుకొండ డివిజన్ డీఎస్పీ కరీముల్లా షరీఫ్ పేర్కొన్నారు. డివిజన్‌లో బ్లూ కోట్స్ పనితీరు బాగుందన్నారు. పురంలో గస్తీ పెంచామని, మతపరమైన ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

● **ప్ర: అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ఏం చేయనున్నారు?**

జ: డివిజన్‌వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తాం. ఇప్పటికే నకిలీనోట్ల ముఠా గుట్టు రట్టు చేశాం. పట్టణంలో ఎక్కడైనా మట్కా, జూదం జరుగుతున్నా, అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నా ఆ ప్రాంత అధికారులను బాధ్యులను చేస్తాం. మేళాపురం, ఆర్టీసీ, పరిగి బస్టాండ్, రహమత్‌పూర్ సర్కిల్, చిన్న మార్కెట్, తూమకుంట ప్రాంతాల్లో పోలీసులను మఫ్టీలో ఉంచాం.

● **ప్ర: పురంలో మతపరమైన ఘటనలు చోటుచేసుకొంటున్నాయి. నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

జ: హిందూపురంలో మతపరమైన ఘటనలు అప్పుడప్పుడు చోటుచేసుకుంటున్నాయి. నేను బాధ్యతలు చేపట్టాక అలాంటి సంఘటనలపై మరింత దృష్టి పెట్టాను. ఇలాంటివి పునరావృతమవకుండా ప్రతి వార్డులోనూ కమిటీలు వేస్తున్నాం. ఇప్పటికే పట్టణంలో 12 ఏర్పాటయ్యాయి. అందరూ సేవాభావంతో మెలిగేలా తరచూ సమావేశాలు పెట్టి ప్రజల్లో మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం.



కరీముల్లా షరీఫ్, డీఎస్పీ

ముఖాముఖి

● **ప్రశ్న: నేరాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

జవాబు: హిందూపురంలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎవరైనా ఊళ్లకు వెళితే ప్రత్యేక యాప్(ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా భద్రత కల్పిస్తున్నాం. ఆయా ఇళ్లలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నాం. పౌరులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలి. రాత్రి 10.30 తర్వాత దుకాణాలు, హోటళ్లు మూసివేయాలి. ప్రధాన కూడళ్లు, శివారు ప్రాంతాల్లో రాత్రివేళ అనుమానితులు తిరుగుతుంటే వివరాలు సేకరిస్తున్నాం. అవసరమైతే స్టేషన్‌కు తీసుకువెళ్లి కుటుంబీకులను పిలిపించి వదిలిపెడుతున్నాం. ప్రార్థనా మందిరాలు, ఆలయాల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకునేలా చూస్తున్నాం.

● **ప్ర: రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడటంలేదు?**

జ: రహదారి నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రధానప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం పోలీస్ అధికారులు, సిబ్బంది ఉంటూ వాహనచోదకులు నిబంధనలు పాటిస్తున్నారా లేదా గమనిస్తున్నాం. పట్టణంలో బెంగళూరు సర్కిల్, వన్‌టౌన్ సర్కిల్‌తో పాటు పలు చోట్ల డివైడర్లు ఏర్పాటు చేయించాం. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమేరాల ఏర్పాటయ్యాయి. నియమావళి పాటించని వాహనాలను గుర్తించి తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్నాం. సేవామందిర్ వద్ద తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని గుర్తించి నియంత్రణా చర్యలు తీసుకుంటున్నాం.

విద్యార్థి సంఘాల ఆగడాలకు అడ్డుకట్ట వేయండి

24న రాష్ట్రబంద్‌కు పిలుపు

హిందూపురం అర్బన్: విద్యార్థి సంఘాల ముసుగులో కొనసాగుతున్న ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, రియాజ్, వేణుగోపాల్, నరేష్, ఈశ్వరయ్య, అక్బర్‌షరీఫ్, శివయ్య, మారుతి, శివకుమార్, నరసింహారెడ్డి, బాబా తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యాసంస్థలను బలవంతంగా బంద్ చేయించటం, చందాలరూపంలో వసూళ్లకు పాల్పడటం, యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు దిగటం, పాఠశాల ఆస్తులకు నష్టం కలిగిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కర్నూలులో ఇటీవల ఓ పాఠశాలలో జరిగిన ఉదంతం విద్యార్థి సంఘాల దౌర్జన్యాలకు అర్థం పడుతోందన్నారు. విద్యాసంస్థల ప్రత్యేక రక్షణచట్టం తీసుకురావాలని కోరారు. విద్యార్థి సంఘాల దౌర్జన్యాలను నిరసిస్తూ 24న రాష్ట్రబంద్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రచారపత్రాలు విడుదల చేశారు.



శ్రీకంఠపురంలో కేక్ కత్తిరిస్తున్న అభిమానులు

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

హిందూపురం, న్యూస్‌టుడే: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలోని శ్రీకంఠపురంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఝాన్సీలక్ష్మీభాయి పాఠశాలలో జరిగిన వేడుకల్లో అభిమాన సంఘ అధ్యక్షుడు అమర్‌నాథ్ మాట్లాడుతూ మెగాస్టార్ అభిమానులు ఆపద సమయంలో ఎందరికో రక్తదానం చేశారన్నారు. చిరుఫ్యాన్స్ కన్వీనర్ సుబ్రమణ్యం, ఆది, హరి, బాబు, ఈశ్వర్, పట్టణవాసులు ఉదయ్‌కుమార్, ఇందాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో... రామ్‌చరణ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో అంధుల పాఠశాలలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు జరిగాయి. విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. వేడుకల్లో అభిమాన సంఘం నాయకులు జమీల్, రాహుల్‌సాయి, రుషి, అంజా, మధు, సునీల్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాశాల విద్యార్థులు

మట్టి వినాయకులే శ్రేయస్కరం

హిందూపురం అర్బన్: వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావణ పరిరక్షణకు సహకరించాలని బిట్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ చంద్రమోహన్, ప్రధానాచార్యులు రమేష్ కోరారు. మట్టివినాయక ప్రతిమల వినియోగంపై మంగళవారం కళాల విద్యార్థులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అంబేడ్కర్ కూడలిలో మానవహారం నిర్వహించారు. పీఓపీతో తయారైన విగ్రహాలు త్వరగా భూమిలో కలవవన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపతి, న్యాయవాది ఇందాద్, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విలీన ప్రక్రియ నిలిపివేయాలి

నిరసనకు దిగిన బ్యాంకు ఉద్యోగులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: బ్యాంకుల విలీనప్రక్రియను వెంటనే నిలిపివేయాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం పిలుపు మేరకు పట్టణంలోని వివిధ బ్యాంకులు మూసివేసి స్థానిక సిండికేట్ బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఫణిభూషణశర్మ, ప్రసన్న, సతీష్, రవిశంకర్, నాగేంద్రప్ప, రమణరాజు తదితరులు మాట్లాడుతూ బ్యాంకులు విలీనం చేస్తే ఎన్నో శాఖలు మూతపడి ప్రజలకు సేవలు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. బ్యాంకుల్లో కార్పొరేట్ రంగానికి చెందిన అప్పులు భారీగా పేరుకుపోయాయని, వసూలుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుల నుంచి బయటపడేందుకు ఖాతాదారులపై సేవా రుసుముల పెంపు పేరిట ఇబ్బందులకు గురిచేస్తోందని, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో ఉద్యోగులపై పనిభారం పెరుగుతోందని, అన్నిస్థాయిల్లో సిబ్బందిని నియమించాలన్నారు. ప్రజావ్యతిరేక బ్యాంకింగ్ సంస్కరణలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. నిరసనలో బ్యాంకు ఉద్యోగులు బాలకృష్ణ, శ్రీలక్ష్మ, త్రివేణి, గాయత్రి, భానుప్రకాష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. నిరసనతో పలు బ్యాంకుల్లో సేవలకు అంతరాయం కలిగింది.



సిండికేట్ బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

'సినిమా పేరు మార్చొద్దు'

హిందూపురంఅర్బన్, న్యూస్‌టుడే: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత ఇతివృత్తాంతం ఆధారంగా రూపొందించే చిత్రానికి ఆయన పేరే పెట్టాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రతినిధులు రామచంద్రారెడ్డి, వెంకటేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, న్యాయవాదులు లక్ష్మీరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్ర ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఆయన పేరుతోనే సినిమా తెరకెక్కించాలన్నారు.

హిందూపురం


ఉపాధి బిల్లులు చెల్లించండి

పరిగి: మండలంలో ఉపాధిహామీ కింద పనిచేసిన కూలీలకు రెండునెలల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండు చేస్తూ మంగళవారం పులువురు కూలీలు ఏపీఓకు వినతిపత్రం అందించారు. వినాయకచవితిని పురస్కరించుకుని అధికారులు బకాయిలు చెల్లించాలని కోరారు. ఏపీఓ సోమశేఖర్ స్పందిస్తూ సాధ్యమైనంత త్వరగా బిల్లులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

రాయితీ పట్టుదారం..వరం

● కొరవడిన అవగాహనతో కొందరికే లబ్ధి

● పేర్ల నమోదు గడువు నేటితో పూర్తి



చీర నేస్తున్న కార్మికుడు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టుపరిశ్రమ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ పట్టు దారం పంపిణీ పథకం చేనేత కార్మిక కుటుంబాలకు వరంగా నిలుస్తోంది. కార్మికుల్లో అవగాహన కొరవడటంతో అందరూ అందుకోలేకపోతున్నారు. పట్టుచీరలను చేనేత మగ్గాల్లో చేతితో తయారుచేసే కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని రాయితీ పట్టుదారం పంపిణీ పథకాన్ని ఐదేళ్లుగా ప్రభుత్వం కొనసాగిస్తోంది. జిల్లాలోని పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, యాడికి, తాడిపత్రి, ఉరవకొండ, గుంతకల్లు, అనంతపురం, సోమందేపల్లి, హిందూపురం, కదిరి, మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం, పెనుకొండ ప్రాంతాల్లో 22406 చేనేత కార్మిక కుటుంబాలు లబ్ధిపొందాల్సి ఉంది. వారిలో 14వేల కుటుంబాలు మాత్రమే పథకాన్ని వినియోగించుకుంటున్నట్లు చేనేత కార్మికసంఘాల నాయకుల పరిశీలనలో తెలుస్తోంది. 4 కిలోల పట్టుదారం కొనుగోలు చేసి చీరలు తయారుచేసిన ఒక్కో కుటుంబానికి గతంలో నెలకు రూ.650లు చెల్లించేవారు. ఈసారి ప్రభుత్వం రూ.1000కి పెంచింది. సంబంధిత అధికారులు ప్రచారం చేయకపోవడం, రాయితీ పట్టుదారం సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మికులు నిరాశచెందుతున్నారు. ఈ నగదు నెలనెలా పొందాలంటే రూ.60 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. ఈనెల 12 నుంచి ప్రారంభమైన ప్రక్రియ నేటి సాయంత్రంతో ముగియనుంది.

డివిజన్	చేనేత కుటుంబాలు
ధర్మవరం	11489
అనంతపురం	7228
పెనుకొండ	1464
హిందూపురం	1633
మడకశిర	90
కదిరి	229
కళ్యాణదుర్గం	273

ప్రచారలోపం..



రాయితీ పట్టుదారం పంపిణీ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతినెలా డబ్బుల చెల్లింపుపై కార్మికుల్లో అవగాహన కొరవడింది. చేతిమగ్గం ఏర్పాటుచేసుకొని రాత్రి, పగలు కష్టపడితే రెండు చీరలు తయారుచేస్తాం. తయారీకి అవసరమైన పట్టుదారం బయట మార్కెట్లో కొనుగోలు చేయాలంటే ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఐదేళ్లుగా ప్రభుత్వం రాయితీ పట్టు దారం అందివ్వడం ప్రయోజనకరంగా ఉన్నా ప్రచారలోపంతో ఎక్కువ మందికి తెలియడంలేదు. **-సోమశేఖర్, ముద్దిరెడ్డిపల్లి చేనేత కార్మికుడు**

అందరూ వినియోగించుకుంటేనే...

రాయితీ పట్టుదారాన్ని వందశాతం వినియోగించుకుంటేనే చేనేతలకు ఫలితం. గతంలోని చేనేత కార్మిక కుటుంబాలు మగ్గాలు తొలగించుకోవడంతో రాయితీ వర్తించదు. మళ్లీ కొత్తగా మగ్గాలు వేసుకుంటే ప్రత్యేక అధికారిని పరిశీలనకు పంపి వివరాలు సేకరిస్తున్నాం. అర్హులైతే ఈ పథకాన్ని ఉపయోగించుకునేలా అవగాహన కల్పిస్తాం. ఇప్పటికే జిల్లాలో 12 నుంచి పేర్ల నమోదు ప్రారంభమైంది. ప్రతి కార్మిక కుటుంబం నిర్లక్ష్యం చేయకుండా రూ.60 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే నెలనెలా రాయితీ దారం నగదు తీసుకోవడానికి వీలుంటుంది.

-అరుణకుమారి, పట్టుపరిశ్రమశాఖ జేడీ, అనంతపురం



ఏడీ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతులు

పరిహారం చెల్లింపులో జాప్యంపై నిరసన

హిందూపురం: గతేడాది ఖరీఫ్‌లో వేరుసెనగ నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పెట్టుబడి రాయితీ ఇస్తోంది. పరిగి మండలం బీచగానపల్లి పంచాయతీకి సంబంధించి 200 మంది రైతులకు పరిహారం అందలేదు. పలుమార్లు అధికారులకు వెళ్లి విన్నవించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఏడీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. వివరాల తారుమారుకు సంబంధించి ఆధార్, బ్యాంక్‌ఖాతా నెంబర్, పట్టాదారు పాస్‌పుస్తకాలు మరోమారు అందించినా ఇవ్వకపోవటంపై మండిపడ్డారు. నష్టపరిహారంపై స్పష్టమైన హామీ ఇచ్చేవరకు కదిలేదిలేదని నినాదాలు చేశారు. రైతు బాలాజీ ఆధ్వర్యంలో నాలుగుగంటల పాటు నిరసన కొనసాగించారు. ఇన్‌ఛార్జి అధికారి సురేంద్రనాయక్, పరిగి ఏవో చైతన్య, శంకర్‌ప్రసాద్ వారికి నచ్చజెప్పారు. వారంలోపు ట్రెజరీ నుంచి రైతుల ఖాతాలకు నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటామనటంతో శాంతించారు.

విత్తన పంపిణీలో పక్షపాతం

పరిగి: మండల పరిధిలోని రైతులకు విత్తన వేరుసెనగ, ఉలవల పంపిణీలో అధికారులు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మంగళవారం పరిగిలో రైతులకు ఉచితంగా ఉలవలు పంపిణీ చేశారు. 10 మంది రైతులకు ఒకటిన్నర క్వింటాళ్లు అందించారు. వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్దసంఖ్యలతో తరలిరాగా కొందరికే ఇవ్వటంతో మిగిలినవారికి నిరాశ ఎదురైంది. అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు విత్తన పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ సుబ్బారెడ్డికి పలువురు రైతులు వినతిపత్రం అందించారు.

సాంకేతిక సమస్యతో వాయిదా

హిందూపురం అర్బన్: సాంకేతిక సమస్యతో బుధవారం కొనసాగాల్సిన ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ వాయిదా వేసినట్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రవికుమార్ తెలిపారు. విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని, తదుపరి పంపిణీ తేదీని తెలియజేస్తామన్నారు.

విత్తనకాయలు పక్కదారి పడుతున్నాయి

చిలమత్తూరు, న్యూస్‌టుడే: వేరుసెనగ విత్తనకాయలు పక్కదారి పడుతున్నాయని రైతులు ఆరోపించారు. మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమఘట్టకి చెందిన కొందరు రైతులు ఏఈవో మల్లికార్జున్‌తో వాగ్వాదానికి దిగారు. విత్తన కాయలు 131 బస్తాలు(20 కిలోలు) వ్యవసాయ కార్యాలయానికి వచ్చాయని, వాటిని ఇప్పటివరకు ఎందరికి ఇచ్చారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రబీ వేరుసెనగ విత్తనకాయల పంపిణీ విషయంలో రాజకీయజోక్యం పెరిగిందన్నారు. మరోవైపు విత్తనకాయల కోసం పలువురు నాయకులు ఏవోకు ఫోన్ చేస్తున్నట్లు తెలిసింది. ఒక తెదేపా నాయకుడు ఇష్టారాజ్యంగా మాట్లాడటంతో కన్నీటి పర్యంతమైనట్లు సమాచారం. మండలంలో దాదాపు ఏడాదిగా ఏవో పోస్టు ఖాళీగా ఉంది. అధికారులు అతికష్టంమీద హిందూపురం నుంచి శ్రీలతను ఏవోగా తీసుకొచ్చారు. ఇక్కడ ప్రతి విషయంలోనూ రాజకీయ ఒత్తిడి అధికమవుతున్న నేపథ్యంలో వేరే ప్రాంతానికి వెళ్లిపోవటానికి సిద్ధమైనట్లు తెలిసింది.



ఏఈవోతో సోమఘట్ట రైతుల వాగ్వాదం

ఓబీసీ మహా సదస్సుకు తరలిరండి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి 28న విజయవాడలో నిర్వహించే ఓబీసీ మహాసదస్సుకు పెద్దఎత్తున తరలిరావాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అమరదేవేంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం భాజపా ఓబీసీ మోర్చా సమావేశం పట్టణాధ్యక్షుడు శేఖర్ నేతృత్వంలో స్థానికంగా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాసదస్సుకు భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పాల్గొనున్నట్లు తెలిపారు. ఓబీసీలకు ప్రధాని నరేంద్రమోదీ కల్పించిన రాజ్యాంగ బద్ధ స్వయం ప్రతిపత్తి వివరిస్తూ కమిషన్ ఏర్పాటు చేయటంలో కృషి చేసిన ప్రధానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో భాజాపా ప్రతినిధులు రమేష్‌రెడ్డి, వరప్రసాద్, ఆదర్శకుమార్, గీతాంజలి, పార్వతమ్మ, బాబు, మంజు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయండి

చాగలేరు(చిలమత్తూరు), న్యూస్‌టుడే: మరుగుదొడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని డీఈఈ మోహన్, పర్యవేక్షణ ఇంజినీర్ శ్రీనివాస్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుబ్రమణ్యానికి సూచించారు. మంగళవారం మండలపరిధిలోని చాగలేరు పంచాయతీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ మరుగుదొడ్డి నిర్మాణానికి లబ్ధిదారులకు మూడు విడతలుగా నగదు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి రాయితీ రుణాలకు ముఖాముఖి

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలో వివిధ కార్పొరేషన్ల పరిధిలో రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతకు 28 నుంచి ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సులోచన తెలిపారు. 28న కంచిసముద్రం సిండికేట్ బ్యాంకు, 29న హిందూపురం సిండికేట్ బ్యాంకు, 30న లేపాక్షి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలోని గ్రామాలకు చెందిన వారికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నవారు తగిన ధ్రువపత్రాలతో హాజరుకావాలని వివరించారు.

అక్టోబరులో హంద్రీనీవా కాలువకు నీరు



పనులు పరిశీలిస్తున్న జలసాధన సమితి ప్రతినిధులు, వీరయ్య తదితరులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పెనుకొండ సమీపంలోని గొల్లపల్లి రిజర్వాయర్, హంద్రీనీవా కాలువపనులను మంగళవారం ఎమ్మెల్యే సహాయకుడు వీరయ్య, జలసాధన సమితి ప్రతినిధులు శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, జమీల్, నరసింహమూర్తి, ఖాసీం తదితరులు పరిశీలించారు. కుంభకర్ణకొండ వద్ద సొరంగమార్గం తవ్వకం, రైల్వేక్రాసింగ్ వంతెన నిర్మాణ పనులను ఇంజినీర్లను అడిగి తెలుసుకొన్నారు. సెప్టెంబరు ఆఖరుకి కాలువ పనులు ముగించి అక్టోబరు మొదటివారంలో హిందూపురం, మడకశిర బ్రాంచి కెనాల్‌కు నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ఈఈ రామకృష్ణారెడ్డి తెలిపినట్లు సమితి ప్రతినిధులు విలేకరులకు వివరించారు. సొరంగ పనులు 270 మీటర్లకుగాను 238 మీటర్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. అక్టోబరు నాటికి హంద్రీనీవా నీటిని ఈ ప్రాంతం చెరువులకు నింపి హిందూపురం తాగునీటి సమస్య తీర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును కోరనున్నట్లు వివరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బీచిగానపల్లి(పరిగి), న్యూస్‌టుడే: మండల పరిధిలోని బీచిగానపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం పాఠశాలలో సన్మానించారు. పాఠశాల హెచ్ఎం నాగప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడిన ఉపాధ్యాయుల సేవల్ని కొనియాడారు. పదోన్నతిపై వెళ్లిన హిందీపండిట్ వెంకటాచలపతి మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో మెలగాలన్నారు. పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. బదిలీపై వెళ్లిన వారిలో చిన్నమల్లయ్య, నాగమణి, మారుతీప్రసాద్ ఉన్నారు. మండల పరిధిలోని మోదా జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులకు మంగళవారం ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అధ్యక్షతన సన్మానకార్యక్రమం ఏర్పాటుచేశారు. ప్రధానోపాధ్యాయిని పద్మప్రియ, పదోన్నతిపై ప్రధానోపాధ్యాయుడిగా వెళ్లిన నాగభూషణశర్మ, గిరిధర్, రాఘవేంద్ర, రామాంజనేయులు, రవీంద్రనాథ్, వెంకటేశులు, జయశంకరప్ప, ప్రేమలత, వరప్రసాద్, సరస్వతమ్మ, శ్రీరాంనాయక్, పీఈటీ వెంకటేశులను పూలమాలలతో సన్మానించారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు.

ఒకే వేతన విధానం అమలు చేయాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా ఒకే తరహా వేతన విధానం అమలు చేయాలని అఖిలభారత విశ్వవిద్యాలయాల డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం కోరింది. ఆ సంఘం మంగళవారం బ్లాక్‌డేగా ప్రకటించింది. ఈ సందర్భంగా అధ్యాపకులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రదర్శన చేశారు. 7వ వేతన సంఘం సిఫార్సులు వెంటనే అమలు చేయాలని, యూజీసీ సమీక్షా నివేదికను బహిర్గతం చేయాలని, ఒకే వేతన విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు రంగస్వామి, విశ్రాంత ప్రధానాచార్యులు చంద్రశేఖర్, జీసీటీఏ, జీసీజీటీఏ నేతలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు



బావులు.. గుండెగుబేలు: ఇసుక తవ్వడంతో శిథిలమైన తాగునీటి బావి



మోసెయ్.. దోచెయ్..: ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు

ప్రాణాలూ తోడేస్తున్నారు..!

ఫోకస్

చిత్రావతి నదికి గర్భశోకం తప్పటంలేదు. ఇష్టానుసారంగా ఇసుకను తోడేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. పల్లెజనం గొంతు తడారిపోతోంది. ఇసుక తరలింపుతో చిత్రావతి నది రూపురేఖలే మారిపోతున్నాయి. అక్రమ రవాణా అమాయకుల ప్రాణాలనూ బలిగొంటోంది. బత్తలపల్లి మండలం ఓబుళాపురం, రామాపురం, ఉప్పర్లపల్లి, దంపెట్ల, గరిశనపల్లి, జ్వాలాపురం, తాడిమర్రి మండలంలో సీసీరేవు, మర్రిమేకులపల్లి, పెద్దకోట్ల, ముదిగుబ్బ మండలంలో పీసీరేవు, చిన్నకోట్లు, మొగలచెట్లపల్లి, తదితర గ్రామాల సమీపంలోని చిత్రావతి నది అక్రమార్కుల ఆదాయానికి అడ్డాగా మారింది. నది చుట్టూ ఇసుకను తరలిస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారుల అండదండలూ పుష్కలంగా ఉండటంతో అడ్డూఅదుపు లేకుండా పట్టణాలకు తరలిపోతోంది. సత్యసాయి తాగునీటి పథకానికి కూడా నీరు అందక గ్రామాలు దాహంతో తల్లడిల్లిపోతున్నాయి. పది రోజులు దాటినా నీరు అందని పరిస్థితి. ఓబుళాపురం వద్ద గ్రామాలకు తాగునీటి కోసం వేసిన గరిస బావులు పూర్తిగా ఎండి పోయాయి. రావాపురం వద్ద నది చుట్టూ నిర్మించిన రక్షణ గోడ సైతం ఇసుక తరలింపులో శిథిలమైంది. 33కేవీ లైను విద్యుత్తు స్తంబాటూ కూలే స్థితికి చేరాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమార్కుల నుంచి నదికి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బత్తలపల్లి



రక్షణ గోడకూ.. రక్షణ కరవయే..: రామాపురం వద్ద శిథిలమైన చిత్రావతి నది రక్షణ గోడ



ఇసుక మాయం.. గోతుల గాయం: గుంతలమయంగా చిత్రావతి నది

CLASSIFIEDS

BIRTHDAY GREETINGS



EDUCATION

SPOKEN ENGLISH

మీ ఇంట్లో ఉంటూ ప్రతిరోజు 1 గం॥ ఫోన్ ద్వారా ఇంగ్లీష్ నేర్చుకోవాలనుకుంటున్నారా? (5 am to 11 pm). మీ ఇంట్లోనే హోమ్ ట్యూషన్ లేదా ఇన్స్టిట్యూట్‌లో ట్రైనింగ్ కొరకు ✆ 9440741997. (sin: 2006)

COACHING CENTRES

Inter Chemistry / Physics Practicals Classes. 20% Discount for 1st 50 enrolled Students. Con: 8919407094, 9948439451.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, **DASETTY** VISHNU MADHAV (Old Name) R/o. 4-499, Shiva Nagar, Dharmavaram - 515671, Anantapur (Dist) A.P. have Changed by my Name as DASETTY PUNEETH VISHNU MADHAV (New Name) S/o Dasetty Nagaraju.

PROMOTION GREETINGS

పదోన్నతి శుభాకాంక్షలు



శ్రీ ఎస్.బాలాజినాయక్ గారు
Superintendent
Agriculture Department

విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి, అందరి మన్ననలు పొంది, సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన మా సార్ ఎస్.బాలాజినాయక్ గారికి మాహృదయ పూర్వక శుభాకాంక్షలు. మీరు మరిన్ని ఉన్నతపదవులు పొందాలని కోరుకుంటూ...



ఎస్.కె.సుబ్రమణ్యం నాయక్
B.A, B.L.,
బంజారా నాయకులు, వజ్రకరూరు.

REAL ESTATE

HOUSE FOR SALE

ATP కళ్యాణదుర్గం రోడ్డు జొన్నా ఐరన్‌మార్ట్ ఎదురుగా గల కాలనీల మధ్యలో 30', 25' వెడల్పు గల తారు రోడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌తో అన్ని సౌకర్యాలతో లే అవుట్‌లో 100% వాస్తుతో మోడ్రన్ Elevetionsతో కొత్తగా నిర్మించబడుతున్న 50 ఇండ్ల (Row Houses) గృహ సముదాయము. 9063552577, 9966146485.

అనంతపురం RTC బస్టాండుకు అతి సమీపంలో 2.5 సెంట్లలో 2 BHK హౌస్, 42 Lakhsకు కట్టించి ఇవ్వబడును. Only One ప్లాటు మాత్రమే కలదు. సంప్ర॥ 9966738330, 9949999621.

JOBS

Wanted Young and dynamic store Manager. Attractive Salary and incentives. Preference: mobile industry. Cont: 94936 44146 (Jeevan)

అనంతపురం పట్టణములో 3 స్టార్ హోటల్స్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, (కంప్యూటర్ ఆపరేటర్స్) సూపర్‌వైజర్స్, Ex-సర్వీస్‌మెన్, రూం బాయ్స్, హౌస్ కీపింగ్ బాయ్స్ & గర్ల్స్, వంట మనుషులు, పనిమనుషులు, సప్లయర్స్, లేబర్స్ స్త్రీ/పు అర్జెంటుగా కావలెను. Ph: 9550437944.

Wanted Male Managers for MNC. Qly: Inter/ Degree, Age: 18-30 (Un Married) Earn 12,000 During Training, 35,000 After Training. ✆ 99854 14206.

Wanted Lady Experenced Teachers to teach 1st Class to 7th class all subjects. A.J.E.M. School, Aravind Nagar. Ph: 7075097711.

అనంతపురంలో సాయినగర్ 1వ క్రాస్‌లోని లక్ష్మి హాస్పిటల్ నందు పనిచేయుటకు సిస్టర్స్ కావలెను. జీతం అనుభవాన్ని బట్టి 5000 నుండి 8000 వరకు ఇవ్వబడును. Ph: 8142959115.

ప్రముఖ లిమిటెడ్ కంపెనీలలో డైరెక్ట్ జాబ్ సూపర్‌వైజర్లు, వర్కర్స్, ఫ్యాకింగ్‌బాయ్స్ కావలెను. జీతం: 13,000- 17,000 రూమ్+ భోజనం ఫ్రీ ✆ 70952 64342, 70952 64386.

AP ఇండస్ట్రియల్ జిల్లాలవారీగా ఉద్యోగాలు బి.టెక్ (ME, EEE) డిప్లొమా ఐటిఐ ఆల్ 10th, ఇంటర్, డిగ్రీ. వ: 30 లోపు, జీ: 10 to 15 వేలు, రూ+ భో. సౌకర్యం. అర్హతకల్గినవారు మీ పూర్తి అడ్రస్‌ను SMS మాత్రమే చేయగలరు. ✆ 98483 48684.

హిందూపురం, మడకశిర, కొత్తచెరువు, కళ్యాణదుర్గం ప్రాంతాలలో సోనాలికా ట్రాక్టరు షోరూముల నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. అర్హత, అనుభవము బట్టి ఆకర్షణీయమైన జీతం. 7799951001 / 7799951002.

మీజిల్లాలోని కంపెనీలలో వర్క్ చేయుటకు హెల్పర్స్, సూపర్‌వైజర్స్, మేనేజర్స్, ITI (ఆల్ ట్రేడ్స్) వారు కావలెను. జీతం 13 నుండి 16 వేలు, బోనస్ 2 వేలు, రూము+ భోజనం ఫ్రీ. 8886418433.

ప్రముఖ కం॥లో పనిచేయుటకు సూ॥వైజర్స్, హెల్పర్స్, ప్యాకర్స్ కావలెను. జీ: 17 వేలు OTతో ఆపైన రూం+ భో ఫ్రీ. Q: 5th ఆపైన. 7097123055, 7097422984.

ఆఫీసు నందు వర్క్‌చేయుటకు కంప్యూటర్ అనుభవం గల టెలికాలర్ మరియు డెలివరి బాయ్స్ కావలెను. Ph: 9182576366.

FACULTY / TEACHERS

Urgently Wanted Teachers: To Teach Social, Physics for 6 to 10th and Social, Science subs for 1to 5th E.M. Classes and also Computer Teachers. 50 KM Travelling up & down T.A. with Salary. Here Staying free food & Accomodation. Imdtly., Contact: Vignan E.M. High School, Somandepalli, Near Penukonda, Anantapur Dist. 9440416950, 9492625602.

DRIVERS

బెంగుళూరులోని ఎయిర్‌పోర్టునందు పనిచేయుటకు టాక్సీ బ్యాడ్జ్ కమర్షియల్ లైసెన్స్‌గల అనుభవంగల డ్రైవర్లు కావలెను. వసతి సౌకర్యం కలదు. ✆ 73489 98216.

TOURS & TRAVELS

విమాన టికెట్స్, పాస్‌పోర్ట్, విసా, రైల్వే టికెట్స్, కరెన్సీ ఎక్ఛేంజ్ మరియు పాన్‌కార్డ్ కొరకు సంప్ర॥ అహ్మద్ ట్రావెల్స్. Cell: 7416350849, 9393711283.



గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సూదులు వేయం.. సెలైన్ ఎక్కించం!

విధులు బహిష్కరించిన హౌస్ సర్జన్లు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: 'ఎంతో కష్టపడి పని చేస్తున్నాం. అయినా గౌరవం లేదు. గుర్తింపు ఇవ్వడం లేదు. నర్సులు, ఇతర సిబ్బంది పనులన్నీ తామే చేస్తున్నాం. ఇక నుంచి సూదులు వేయం. సెలైన్ ఎక్కించం. అసలు మా విధులు ఏమిటో చెప్పండి'.. అంటూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి హౌస్ సర్జన్లు ప్రశ్నించారు. మంగళవారం వారు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. ఆస్పత్రి ఓపీ ప్రధాన ముఖద్వారం ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ జుడా సంఘం నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొంటున్నాం. నాలుగు మాసాలు గడిచినా స్టయిఫండ్(భత్యం) చెల్లించలేదు. మార్చి 30న ఇక్కడ చేరాం. ఇప్పటికీ ఒక నెల కూడా ఇవ్వలేదు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చూపిస్తున్నారని వారు ఆరోపించారు. ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ లలిత అక్కడికి చేరుకున్నారు. మీ సమస్యలన్నీ తీరుస్తామని హామీ ఇచ్చారు. అయినా వారు అంగీకరించలేదు. ఆర్ఎంఓ వెళ్లిన తర్వాత మళ్లీ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ఆస్పత్రి ఇన్‌ఛార్జి వైద్య పర్యవేక్షకుడు ఆచార్య వెంకటేశ్వర్‌రావును కలిశారు. సమస్యలను చెప్పారు. రెండు రోజుల్లో అన్నీ పరిష్కరిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వార్డుల్లో ఇక్కట్లు

హౌస్ సర్జన్లు విధులు బహిష్కరించడంతో ఇటు ఓపీ, అటు వార్డుల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రతి వార్డు, ఐపీలో ఇద్దరేసి చొప్పున హౌస్ సర్జన్లు విధుల్లో ఉండేవారు. మంగళవారం వీరు విధులకు వెళ్లకపోవడంతో చాలా ఓపీలు ఖాళీగా కనిపించాయి. వార్డుల్లో నర్సులే సూదులు, ఇతర పనులు చేయాల్సి వచ్చింది.



ఆందోళన చేస్తున్న హౌస్ సర్జన్లు

అవసరం చెట్టంత.. అందుబాటులో విత్తంత!



విత్తనం కోసం తరలివచ్చిన రైతులు

(మొదటి పేజీ తరువాయి) రైతులు తప్పనిసరిగా వాటిని సాగు చేయాల్సిందే అని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.”

జిల్లాలో రైతులకు ప్రత్యామ్నాయ విత్తు పంపిణీ కార్యక్రమాన్ని మూడు రోజుల కిందట ఆరంభించినా.. వారి అవసరాలకు సరిపడా విత్తు పూర్తిస్థాయిలో ఇంకా జిల్లాకు చేరలేదు. దాదాపు ఐదున్నర లక్షల హెక్టార్లకుపైగా ప్రత్యామ్నాయ పంటలు వేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే ఆ మేరకు అవసరమైన విత్తు మాత్రం సిద్ధం కాలేదు. వివిధ రకాల ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి 1.12 లక్షల క్వింటాళ్ల విత్తు అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు జిల్లాకు కేవలం 13 వేల క్వింటాళ్ల విత్తు మాత్రమే జిల్లాకు వచ్చింది. దీంతో ఆ వచ్చిన విత్తునే కొంత చొప్పున మండలాలకు సర్దుబాటు చేసి పంపుతున్నారు. అలాగే ఏపీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలో (ఏపీసీడ్స్) అందుబాటులో ఉన్న నవధాన్యాల సంచులను కూడా రైతులకు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకా దాదాపు లక్ష క్వింటాళ్లకుపైగా విత్తు కావాల్సి ఉండగా, అది జిల్లాకు చేరేందుకు ఈ నెలాఖరుదాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. విత్తు సరఫరా టెండరు దక్కించుకున్న గుత్తేదారులు ఆయా విత్తును సేకరించే పనిలో ఉన్నారు. ఆ తర్వాత విత్తును జిల్లాకు పంపిస్తారు. దీంతో జిల్లాకు పూర్తి స్థాయిలో విత్తు రావడానికి జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ఉలవలు, సజ్జ, జొన్న, పెసలు కొంత మేర జిల్లాకు వచ్చాయి. ఇంకా డిమాండ్ ఎక్కువగా ఉన్న అలసందలు, హైబ్రీడ్ రకాల విత్తు జిల్లాకు చేరలేదు.

విత్తు తీసుకుంటే సరిపోదు..

రైతులు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఉచితం ప్రత్యామ్నాయ విత్తును అందిస్తున్నారు. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసేందుకు వీలుగా అవసరమైన ఆయా ప్రత్యామ్నాయ విత్తును వ్యవసాయ శాఖ అందిస్తోంది. అయితే ఉచిత విత్తు కావడంతో రైతులు పెద్ద సంఖ్యలో పంపిణీ కేంద్రాల వద్ద వరుస కడుతున్నారు. ఆయా రకాల విత్తు తీసుకోవడానికి పోటీపడుతున్నారు. ఇలా రైతులు వచ్చినపుడు వ్యవసాయ శాఖ అధికారులు అసలు నిజం చెబుతున్నారు. విత్తు తీసుకెళ్తే సరిపోదనీ.. ఆ విత్తుతో తప్పనిసరిగా సాగు చేయాలని చెబుతున్నారు. రైతులు సాగు చేసిన పంటలకు ఈసారి పక్కాగా ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. ట్యాబ్‌ల ద్వారా ఆయా రైతుల పొలాల వద్ద సాగు చేసిన పంటల చిత్రాలను తీస్తున్నారు. వీటిని అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో రైతు పంట సాగు చేశాడని స్పష్టం అవుతోంది. ఒకవేళ పంట వేయకపోతే ఈ-క్రాప్ బుకింగ్‌లో అది తెలిసిపోతుంది. రైతులంతా ఇప్పటికే ఖరీఫ్ సమయంలో రాయితీ వేరుసెనగ విత్తు తీసుకోగా, వర్షాభావం నేపథ్యంలో ఇపుడు ప్రత్యామ్నాయ విత్తు తీసుకుంటున్నారు. ఈ ప్రత్యామ్నాయ విత్తుతో సాగు చేయకపోతే మాత్రం.. ఆ విత్తు ఎంత విలువైనదో ఆ మేరకు రైతుల నుంచి రికవరీ చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పంట మేరకు పెట్టుబడిరాయితీ..

మరోవైపు రైతులు ప్రత్యామ్నాయ విత్తుతో సాగు చేస్తే, ఆ పంట కూడా వర్షాభావంతో ఎండిపోయినా, దిగుబడి తగ్గినా ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి రాయితీ అందుతుంది. అయితే వారు సాగు చేసిన పంట మేరకు పెట్టుబడి రాయితీ ఉంటుంది. రైతులు ఏ పంటా సాగు చేయకపోతే వారికి అసలు పెట్టుబడి రాయితీ రాదని అధికారులు చెబుతున్నారు. వేరుసెనగకు కొంత ఎక్కువ మొత్తం పెట్టుబడి రాయితీ ఉండగా, మిగిలిన పంటలకు తక్కువ మొత్తం పెట్టుబడి రాయితీ అందుతుంది. అసలు ఏ పంట సాగు చేయని వారికి పెట్టుబడి రాయితీ వచ్చే అవకాశం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

సర్వర్ సతాయింపు

● 37 మండలాల్లోనే పంపిణీ

● భారీగా తరలివస్తున్న రైతులు

జిల్లా వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయశాఖ ప్రత్యామ్నాయ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. బయోమెట్రిక్ విధానంతో పంపిణీ సాగుతోంది. అయితే సర్వర్ పనిచేయక పోవడంతో ఇబ్బందులు నెలకొన్నాయి. మంగళవారం గంటన్నర పాటు సర్వర్ ఆగిపోయింది. దీంతో రైతులంతా కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. పెద్ద ఎత్తున తరలివచ్చి బారులు తీరారు. ప్రస్తుతం 37 మండలాల్లో పంపిణీ చేపట్టారు. విత్తన కొరతే ఇందుకు కారణమని ఆశాఖ వర్గాలు తెలిపాయి. విత్తనం ఉచితం కావడంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఇప్పటికే పంటలు సాగు చేసిన వారు, సాగు చేయని వారంతా వస్తున్నారు. అందరికీ విత్తనం ఇవ్వాల్సిందేనని అధికారులపై రైతులు గొడవలకు దిగుతున్నారు. కొందరు రైతులు ప్రజాప్రతినిధులతో అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు.

1,218 క్వింటాళ్ల పంపిణీ

జిల్లాలో మూడ్రోజులుగా 1218 క్వింటాళ్ల విత్తనం 6,203 మంది రైతులకు పంపిణీ చేశామని జేడీఏ శ్రీరామ్మూర్తి తెలిపారు. అందులో పెసలు 138.64 క్వింటాళ్లు, అలసంద 350 క్వింటాళ్లు, ఉలవలు 702 క్వింటాళ్లు, జొన్నలు 26.50 క్వింటాళ్లు, కందులు, కొర్రలు పంపిణీ చేశారు. ఈ-పంట నమోదు కాని, పంట వేయని రైతులకు మాత్రమే ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. హైబ్రిడ్ పొద్దుతిరుగుడు, సజ్జ, జొన్న మొక్కజొన్న విత్తనాలను రాయితీతో పంపిణీ చేస్తామన్నారు. ఉలవ పంట సెప్టెంబరులో వేసుకుంటేనే మంచి దిగుబడి వస్తుందని జేడీఏ తెలిపారు.

చికుబుకు చికుబుకు రైలే.. స్వచ్ఛత లేనే లేదే!



భువనేశ్వర్ నుంచి అనంత పురం మీదుగా బెంగళూరుసిటీకి వెళ్లే రైలు(18463) బెంగళూరుకు మధ్యాహ్నం 12.05 గంటలకు చేరుకుంటుంది. రెండు గంటల విరామం తర్వాత తిరిగి భువనేశ్వర్‌కు బయలు దేరుతుంది. ఈ రెండు గంటల్లో ఇంజిన్ తిప్పుకోవడం, ఏసీ బోగీల్లో దుప్పట్లు మార్చడానికే సరిపోతుంది. సమయం ఉంటే మరుగుదొడ్లు శుభ్రం చేస్తారు. ఒకవేళ రైలు ఆలస్యంగా నడిస్తే ఆరోజు మరుగుదొడ్లు కూడా శుభ్రం చేయరు. ఇక బోగీలను శుభ్రం చేయడానికి వీలుకాదు.

● అనంత మీదుగా నడిచే రైళ్లు: 120

● ఎక్స్‌ప్రెస్‌లు: 20

● ప్యాసింజర్ రైళ్లు: 08

● వారాంతపు రైళ్లు: 92

● నిత్యం ప్రయాణికుల సంఖ్య: 10 వేలు పైనే

జబల్‌పూర్ నుంచి యశ్వంతపూర్ వెళ్లే (12194) రైలు యశ్వంతపూర్‌కు మధ్యాహ్నం 1.30 గంటలకు వెళుతుంది. అదే రోజు మధ్యాహ్నం 3.50 గంటలకు తిరిగి జబల్‌పూర్‌కు (12193) బయలుదేరుతుంది. ఈ రైలుకు కేవలం రెండు గంటలు మాత్రమే విరామం ఉండటంతో బోగీలను శుభ్రం చేయడం కష్టమే. అపరిశుభ్రత నడుమే ప్రయాణికులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

(మొదటి పేజీ తరువాయి) రైళ్లు రెండు గంటల్లో వెనుదిరగాల్సి రావడంతో శుభ్రత వెతికినా కనిపించడం లేదు. బోగీలన్నీ దుమ్ముధూళితో నిండిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జబ్బుల బారిన పడుతున్నారు. డిపో నుంచి బయలు దేరిన రైలు తిరిగి చేరిన తర్వాతనే బోగీలను శుభ్రం చేస్తున్నారు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు రెండు, మూడు రోజులయినా శుభ్రతకు నోచుకోవడం లేదు. భువనేశ్వర్‌లో బయలుదేరిన రైలు తిరిగి అక్కడికి చేరుకోవడానికి నాలుగు రోజులు పడుతుంది. అప్పటివరకు బోగీలను శుభ్రం చేయడానికి వీలు కాదు. ఇలాంటి పరిస్థితి అనేక రైళ్లలో నెలకొంది.

కొన్నింటిలోనే సంచార సేవలు

రైల్వే శాఖ కొన్ని రైళ్లలో సంచార పరిశుభ్రత(ఆన్ బోర్డు క్లీనర్స్)ను ఏర్పాటు చేశారు. ఈ రైళ్లలో అన్ని బోగీల్లోనూ పారిశుద్ధ్య కార్మికుడి (క్లీనర్) నంబరు రాసి ఉంచారు. ఆ నంబరుకు ఫోన్ చేసి చెబితే సంబంధిత బోగీలో మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్నారు. రద్దీ అధికంగా ఉన్న ప్రధాన రైళ్లలో మాత్రమే ఇలాంటి అవకాశం ఉంది. ఒకటి రెండు రైళ్లలో మాత్రమే ఆన్‌బోర్డు క్లీనర్ విధానంలో భాగంగా ఇద్దరు కార్మికులను అందుబాటులో ఉంచుతున్నారు. ఇదే విధానం అన్ని రైళ్లలోనూ అమలు చేస్తే బాగుంటుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

అమ్మో.. రైలు ఎక్కలేం

శ్వాస సంబంధ వ్యాధులతో బాధపడే వారు రైళ్లలో ప్రయాణించాలంటేనే భయపడిపోతున్నారు. ఓవైపు మరుగుదొడ్ల దుర్వాసన, మరో వైపు బోగీల్లో దుమ్ము ధూళి ఉండటంతో అస్తమా, అలర్జీ వంటి జబ్బులతో బాధ పడే ప్రయాణికులు అస్వస్థతకు గురవుతున్నారు. అలాంటి వారు రైలు ఎక్కే సమయంలోనే మందులు వేసుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఉబ్బసం బాధితులు మార్గ మధ్యలోనే రైలు దిగి వెళ్లిన సందర్భాలు ఉన్నాయి.

నాణ్యతలేని ఆహారం

రోజూ నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వంటశాల (పాంట్రీ కార్) బోగీలు ఉన్నాయి. వంట శాలలోనూ శుభ్రత కొరవడింది. రైళ్లలో సరఫరా చేస్తున్న ఆహార పదార్థాల్లో నాణ్యత లేదని ఇటీవల కాగ్ నివేదిక పేర్కొంది. కాగ్ నివేదిక తర్వాత రైల్వేశాఖలో మార్పు వస్తుందని ప్రయాణికులు భావించారు. కానీ అధికారులు అడపాదడపా దాడులతో సరిపెట్టారు. పాంట్రీకార్‌లోకి ఎలుకలు, బొద్దింకలు చేరుతున్నాయి. అవి ఇతర బోగీలలోకి వ్యాప్తిస్తున్నాయి. వంట చేయడానికి శుద్ధజలం వినియోగించాలని రైల్వే అధికారులు నిబంధన పెట్టారు. అయితే కొన్ని సందర్భాల్లో కొళాయి నీటిని వాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కూరగాయలు తరిగిన తర్వాత వృథాను చెత్తబుట్టలోనే వేయాలి. అలాగే కూరగాయలు, నిత్యావసర వస్తువులను నిల్వ చేసే ప్రాంతంలో ఎలుకలు, ఇతర కీటకాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్వాహకులు తరచూ శుభ్రం చేయాలి. ఇలాంటివేవీ కనిపించడం లేదు. పాంట్రీకార్ నిర్వహణలోనూ నిర్లక్ష్యం నెలకొంది.



స్వచ్ఛమైన నీటినే వినియోగించాలి

గుంతకల్లులో ఇలా..

జిల్లాలోని గుంతకల్లు స్టేషన్‌లో కొన్ని రైళ్లలో మరుగుదొడ్లను శుభ్రం చేసి, చెత్తను తొలగిస్తున్నారు. రైళ్లలో శుభ్రతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. గుంతకల్లులో 10 నిమిషాలు ఆగే రైళ్లలో యంత్రాలతో శుభ్రం చేయాల్సి ఉంది. నిత్యం సుమారు 10 రైళ్లలో శుభ్రతా చర్యలు చేపడుతున్నారు. ఈ సమయం మరుగుదొడ్లను శుభ్రం చేయడానికే సరిపోతుంది. బోగీల్లో చెత్త తొలగింపు అరకొరగానే చేస్తున్నారు.

శుభ్రత మెరుగుపడాలి

- వెంకటకృష్ణ, ప్రయాణికుడు

బోగీలలో శుభ్రత కొరవడుతోంది. అపరిశుభ్రత నెలకొంది. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని రైల్వే అధికారులు స్టేషన్‌లలో కంటే బోగీలలో చేపడితే బాగుంటుంది. బోగీలు దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి. రైలు తిరిగి వచ్చే దాకా వదిలేయకుండా మార్గ మధ్యలో శుభ్రత చర్యలు చేపడితే బాగుంటుంది.

కార్మికులను అందుబాటులో ఉంచాలి

- సంజప్ప, ప్రయాణికుడు

ప్రధాన రైళ్లలో సంచార పరిశుభ్రత(మొబైల్ క్లీనర్స్)ను ఏర్పాటు చేశారు. ఇలాంటి వ్యవస్థను అన్ని రైళ్లలోనూ ఏర్పాటు చేయాలి. మరుగుదొడ్లలో నీరు రాకపోతే దుర్వాసన భరించలేం. అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ మొబైల్ క్లీనర్స్‌ను ఏర్పాటు చేయాలి. సాధారణ (అన్ రిజర్వు) బోగీలలో శుభ్రత కనిపించదు. కనీసం జంక్షన్లలోనైనా సాధారణ బోగీలను శుభ్రం చేస్తే బాగుంటుంది. ప్రయాణికులు అధికంగా ఉండటంతో త్వరగా దుర్వాసన, దుమ్ము కనిపిస్తుంది. అధికారులు తగిన శ్రద్ధ చూపాలి.

జలస్తంభన

(మొదటి పేజీ తరువాయి) జలాశయాలకు నీటిని మళ్లించాలనే ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అయితే చివరి నిమిషంలో బళ్లారి ప్రాంత హెచ్చెల్సీ ఇంజినీర్లు మనసు మార్చుకున్నారు. తమ ప్రాంతంలో ఇప్పుడు నీరు వద్దనీ.. ఈ నెలాఖరు నుంచి నీటిని తీసుకుంటామని తాజాగా పేర్కొన్నారు. మరోవైపు మంగళవారం ఉదయం తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా అనంతకు నీరిచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో తుంగభద్ర బోర్డు కార్యదర్శి రంగారెడ్డి, ఇక్కడి హెచ్చెల్సీ ఎస్ఈ శేషగిరిరావుతో మాట్లాడారు. కేవలం మీకు మాత్రమే నీటిని విడుదల చేస్తామని చెప్పారు. అదే జరిగితే ఎగువన 105 కి.మీ. వరకు బళ్లారి ప్రాంతంలో ఉన్న హెచ్చెల్సీ కాల్వ నుంచి జలదోపిడీ జరుగుతుందని ఇంజినీర్లు భావించారు. అందుకే తమకు కూడా నీటిని విడుదల చేయొద్దని చెప్పారు.

30న విడుదల చేసే అవకాశం...


తాజాగా తుంగభద్ర జలాశయం నుంచి అన్ని కాల్వలకు తాగునీటి అవసరాల నిమిత్తం ఈ నెల 30 నుంచి నీటిని విడుదల చేయాలని తుంగభద్ర బోర్డు అధికారులు భావిస్తున్నారు. రెండు రోజుల కిందట కర్ణాటక ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారు. ఆ సమయంలో బళ్లారి ప్రాంతానికి కూడా నీటిని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో 30 నుంచే అందరితోపాటు నీటిని తీసుకోవాలని భావిస్తున్నారు. అలా నీటిని తీసుకుంటే.. హెచ్చెల్సీ కాల్వ మన జిల్లా సరిహద్దులో ఉన్న 105వ కి.మీ. నుంచి వచ్చే నీటిని లెక్కిస్తారు. దీనివల్ల ఎగువున జల దోపిడీ లేకుండా పూర్తిస్థాయిలో నీటిని తీసుకునేందుకు వీలుంటుందని భావిస్తున్నారు.

పెరగనున్న నీటినిల్వ...

తుంగభద్ర జలాశయంలో కేవలం 53 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉండగా.. తాజాగా రైతులకు తీపి కబురు వచ్చింది. జలాశయం ఎగువన మంచి వర్షాలు కురుస్తున్నాయి. వీటివల్ల వచ్చే నాలుగైదు రోజుల్లో నిత్యం 20 వేల క్యూసెక్కులకుపైగా నీరొస్తుందని అంచనా వేస్తున్నారు. వెరసి జలాశయానికి మరో 10 టీఎంసీల వరకు నీటి నిల్వ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే మనకు ప్రస్తుతం 8 టీఎంసీలు వస్తాయని భావించగా, అది మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ పరిణామాలు అన్నింటి నేపథ్యంలో.. ఈ నెల 30 వరకు వేచిచూసే ధోరణి అవలంబించాలని హెచ్చెల్సీ ఇంజినీర్లు భావిస్తున్నారు.

సత్వర చికిత్సతో ఉపశమనం!

- ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపయుక్తం
- అందుబాటులో అధునాతన వైద్యం
- సర్వజన ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేక కేంద్రం



రంగుల డీఈఐసీ

న్యూస్‌టుడే, అనంతపురం (వైద్యం)

పుట్టుకతో వచ్చిన జబ్బులు... పెరుగుదల లోపంతో తలెత్తే రుగ్మతలు... వంశపార్యపరంగా ప్రబలే వ్యాధులు.. ఇలా అనేక రోగాలు, సమస్యలతో సతమతమయ్యే భావి భారత బాలల భవిత కోసం ఈ కేంద్రం ఎంతో ఉపయుక్తం... ప్రయోజనం. తాత్కాలికమే కాదు.. శాశ్వతంగా సాంత్వన చేకూరే 'సత్వర చికిత్స' అందుబాటులోకి వచ్చింది. కేవలం బాలల వైద్య చికిత్స కోసమే ఈ కేంద్రం ఏర్పాటయింది. దీన్నే జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డీఈఐసీ) అంటారు. రెండేళ్లుగా ఊరిస్తూ నెల క్రితం ఆరంభమైంది. ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణంలో సర్వ హంగులతో నెలకొల్పారు. పుట్టిన శిశువు మొదలుకుని 18ఏళ్ల పిల్లల వరకు ఇక్కడి సేవలు పొందవచ్చు. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) నిధుల సహకారంతో రాష్ట్రీయ బాలల ఆరోగ్య కేంద్రం(ఆర్‌బీఎస్‌కే) సారథ్యంలో ఏర్పాటైంది. ఈ కేంద్ర నిర్వహణ బాధ్యతను సర్వజన ఆస్పత్రి చూసుకోనుంది.

ముప్పై రకాల సేవలు

గతంలో ప్రాథమిక స్థాయిలో కేవలం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇపుడు ఈ కేంద్రంలో 30 రకాల వైద్య సేవలు అందిస్తారు. ఇందుకు తగిన వైద్య పరికరాలు, సామగ్రిని సమకూర్చారు. పుట్టుకతో వచ్చే జబ్బులు, గ్రహణ మొర్రి, అంగుట్లో చీలిక, వంకర పాదాలు, నడుం భాగం అభివృద్ధి లోపం. సంక్రమిక కంటిపొర, పుట్టుకతో వచ్చే చెవుడు, సంక్రమిక గుండె జబ్బులు, రెటినోపతి, రక్తహీనత, విటమిన్ లోపం, తీవ్ర పోషకాహార లోపం, అయోడిన్ లోపం, చర్మవ్యాధులు, చెవి వ్యాధులు, పిప్పిపళ్లు, మూర్ఛ వ్యాధి, దృష్టి లోపాలు, వినికిడి సమస్యలు, నాడీ సంబంధమైన-చలన సమస్యలు, మేధోపరమైన అసమానత, మాటలు నేర్చుకోలేకపోవడం, అభ్యాసనా ఇబ్బందులు, తలసేమియా... తదితర రుగ్మతలకు ఇక్కడ సత్వర వైద్యచికిత్స అందిస్తారు.


దంతపరీక్షలకు అధునాతన కుర్చీ

'ఆ నలుగురు' కీలకం

ఈ సత్వర చికిత్స కేంద్రంలో చిన్నపిల్లల వైద్యుడు, సాధారణ వైద్యుడితోపాటు... నలుగురు సాంకేతిక సిబ్బందే కీలకం. ఫిజియోథెరపిస్టు, ఆడియాలజిస్టు, సైకాలజిస్టు, దంత వైద్యుడు. ఇందుకు ఆధునాతన దంత కుర్చీ, వ్యాయామ వైద్య (ఫిజియోథెరపీ) పరికరాలు, బెరా మిషన్.. వంటివి కూడా ఉన్నాయి. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల దాకా పని చేస్తుంది.



ఆటలతో ఆహ్లాదం

ఈ కేంద్రానికి సత్వర చికిత్సకు వచ్చే బాలల కోసం ఆహ్లాదకర, ఆకర్షణీయ వాతావరణాన్ని కల్పించారు. ప్రత్యేకంగా ఆట గదిని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆట వస్తువులను పెట్టారు. గోడలపై రంగురంగుల బొమ్మలు, పిల్లలు ఇష్టపడే రంగులను వేశారు. చూడగానే పిల్లలను ఆకర్షించేలా తీర్చిదిద్దారు. ఇక్కడ సేవలన్నీ పూర్తిగా ఉచితమే. అయితే ఇంకా కొన్ని ఆట వస్తువులు, ఇతర పరికరాలు రావాల్సి ఉంది. రోజూ పది నుంచి 15 మంది దాకా ఇక్కడి చికిత్స కోసం వస్తున్నారు. ప్రస్తుతం నగరం,.. పరిసర గ్రామాల నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొచ్చి చికిత్స చేయిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలు వేలాది మంది ఉన్నారు. ఎస్ఎస్ఏ సారథ్యంలో ఐఈఆర్టీ కేంద్రాలు ఉన్నా చాలా చోట్ల మూతపడ్డాయి. ఇపుడు ఆస్పత్రిలో ఆధునాతన సదుపాయాలతో నెలకొల్పారు.

విస్తృత ప్రచారం చేస్తున్నాం : డి.రజిత, మేనేజర్, డీఈఐసీ



ఈ సత్వర చికిత్స కేంద్రాన్ని ప్రారంభించి నెల రోజులయింది.. ఇక్కడ సదుపాయాలు బాగున్నాయి. పిల్లలు చికిత్సకు వచ్చేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఇప్పటికే పీహెచ్‌సీ, ఐఈఆర్టీ కేంద్రాలకు తగిన సమాచారం పంపాం. కరపత్రాలు కూడా పంపిణీ చేశాం. ఏయే జబ్బులు, రుగ్మతలకు ఇక్కడ సేవలు అందుతాయన్న దానిపై సమగ్రంగా తెలియజేస్తున్నాం. ఫిజియోథెరపీ, మాటలు రాకపోయినా, చెవుడు, దంత సమస్యలు, నడవ లేకపోయినా, చేతులు, కాళ్లు సచ్చుగా ఉన్నా... ఇలా అనేక రకాల రుగ్మతలకు సత్వర చికిత్స అందిస్తున్నాం. తగిన సాంకేతిక నిపుణులు కూడా ఉన్నారు. పిల్లలను ఆకర్షించేందుకు ఆట వస్తువులనుకూడా తెప్పించాం. ఇంకా కొన్నింటికి ప్రభుత్వానికి నివేదిక పంపాం.

నా బిడ్డ నిలబడుతోంది



నా బిడ్డ లక్ష్మికి ఐదేళ్లు. నడుము చచ్చుపడిపోయింది. నడవలేదు.. కూర్చోలేదు. పది రోజులుగా ఈ కేంద్రానికి తీసుకొస్తున్నా. ఇపుడిపుడే నిలబడుతున్నాడు. చాలా మేలు జరుగుతోంది. రోజూ ఒక గంటపాటు నిపుణుల సలహా మేరకు చికిత్స చేయిస్తున్నా. - గౌరి

మాటలు నేర్పిస్తున్నాం



మా పిల్లాడికి మాటలు రావు... కాళ్లు సచ్చుగా ఉంటాయి. వారం రోజులుగా ఇక్కడికి తీసుకొస్తున్నా. రోజూ తగిన వ్యాయామం చేయిస్తున్నాం. ఫిజయోథెరపీ కూడా చేస్తున్నారు. కొన్ని కొన్ని మాటలు వస్తున్నాయిప్పుడు. ఏమయినా మాట్లాడితే అర్థం చేసుకుంటాడు. నా బిడ్డకు నయం అవుతుందన్న నమ్మకం ఏర్పడింది. - సులోచన

వస్తున్నారు.. మన మెస్సీలు..

- పట్టుదలే పెట్టుబడి..
- పేదరికం వెంటాడినా జాతీయ స్థాయిలో మెరుపులు

పేదరికం వెంటాడినా వెనుదీయని కుర్రాళ్లు వారు. ఆటే ఊపిరిగా.... కఠోర సాధనే పెట్టుబడిగా కదిలారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు ఎంపికై మెరుపులు మెరిపిస్తున్నారు. చిరుప్రాయంలోనే ఆటలో అరంగ్రేటం చేసిన ఈ కుర్రాళ్లంతా పేద కుటుంబాలను నుంచి వచ్చిన ఆణిముత్యాలే. ఫుట్‌బాల్ ఆటలో ఎదురులేని మొనగాళ్లుగా ఉనికిని చాటుతున్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుతూ ఆటపై పట్టు సాధించారు. ఎంతో పోటీ ఉన్న ఆటలో అద్వితీయమైన ప్రతిభను చూపుతూ ఉన్నతస్థాయికి చేరుకున్నారు. ఫుట్‌బాల్‌లో పేరుగాంచిన బంగాల్, కేరళ రాష్ట్రాలే కాదు.. మన రాష్ట్రానికీ పేరు తెస్తామంటున్నారు..ప్రోత్సహిస్తే.. మేమూ మెస్సీల్లా తయారవుతామంటున్నారు.. సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. ప్రపంచ ఫుట్‌బాల్ రంగంలో మేరునగధీరులైన మెస్సీ, రోనాల్డో లాంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని దినదినాభివృద్ధి చెందుతున్నారు. అనంతపురం వేదికగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్రంలోని అనేక జిల్లాల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న పేద ప్రతిభావంతులైన క్రీడాకారులు 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు. ఆటలో ఆటుపోట్లను ఎదుర్కొని జాతీయస్థాయికి ఎలా ఎదిగారో వారి మాటల్లోనే విందాం....

- న్యూస్‌టుడే, అనంతపురం క్రీడలు



రాష్ట్ర జట్టును విజేతగా నిలుపుతా

గుంటూరులో ప్రభుత్వ బడిలో చదువుతున్నా. మా నాన్న తాపీమేస్త్రీ పని చేసి నన్ను ఆటలో ప్రోత్సహిస్తున్నాడు. జట్టులో డిఫెండర్‌గా రాణిస్తున్నాను. అనంతపురంలో జరుగుతున్న ఈ పోటీల్లో ఇప్పటికే మూడు గోల్స్ చేశాను. నాలుగేళ్ల నుంచి రోజూ మూడు గంటలు సాధన చేస్తున్నాను. ఇప్పటికే ఐదు పర్యాయాలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. నైవేలీలో గత ఏడాది జరిగిన జాతీయస్థాయి పోటీలకు ఎంపికై రాణించాను. జాతీయస్థాయిలో రాష్ట్ర జట్టును గెలిపించడానికి కృషి చేస్తాను. మన రాష్ట్రం ఫుట్‌బాల్ ఆటలో అగ్రస్థానంలో నిలవాలి.

- శ్యాంప్రసాద్, గుంటూరు



నాన్న వంటపనిచేసి ప్రోత్సహిస్తున్నారు

ఆటతో నాలుగేళ్ల క్రితమే అనుబంధం ఏర్పడింది. కుదుకూరి వీరేశలింగం ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉన్నా పీఈటీల ప్రేరణతో నేర్చుకున్నా. నిత్యం రెండు గంటల సాధన చేస్తాను. జట్టులో రైట్ ఫార్వర్డ్ ఆటగాడిగా పేరుతెచ్చుకున్నా. నాన్న వంటపని చేసి నన్ను ఆటలో ప్రోత్సహిస్తున్నారు. మూడు పర్యాయాలు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాను. గత ఏడాది తమిళనాడులో జరిగిన జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాను. ఇందులో అంతర్జాతీయస్థాయిని అందుకోవాలన్నదే నా కల. దీన్ని సాకారం చేసుకోవడానికి నిరంతరం సాధన చేస్తాను.

- లోకేష్‌కుమార్, రాజమండ్రి


ఫుట్‌బాల్ పోటీలు



జాతీయ సీనియర్ జట్టులో ఆడతా

కడప క్రీడాపాఠశాలలో చదువుతున్నాను. ఫుట్‌బాల్ ఆటలో రాణించడం వల్ల అవకాశం దక్కింది. తండ్రి స్థిరాస్తి వ్యాపారం చేస్తుంటారు. తూర్పుగోదావరి జిల్లా అయినా కడప జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జట్టులో డిఫెండింగ్ మిడ్‌ఫీల్డ్ స్థానంలో రాణిస్తున్నాను. ఐదు పర్యాయాలు రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికై సత్తాచాటాను. రెండు పర్యాయాలు పాఠశాల క్రీడల ఫుట్‌బాల్ పోటీల్లో ఆడి మెరుపులు మెరిపించాను. గత ఏడాది తమిళనాడులో జరిగిన జాతీయ పోటీల్లో ఆడాను. భవిష్యత్తులో అంతర్జాతీయస్థాయి పోటీల్లో ఆడి మనదేశ కీర్తిని ఇనుమడింపజేస్తాను. రోజు నాలుగు గంటల పాటు సాధన చేస్తున్నాను.

-జగదీష్, కడప క్రీడాపాఠశాల



రైతు కుటుంబం నుంచి వచ్చా

ఆత్మకూరు గ్రామం మాది. నాన్న వ్యవసాయం చేస్తారు. ఆర్డీటీ క్రీడా ఉపకేంద్రంలో ఓనమాలు దిద్దాను. శిక్షకులు మల్లేష్, మౌర్య నా భవిష్యత్తుకు బాటలు వేశారు. నా ప్రతిభను గుర్తించి ఆర్డీటీ అకాడమీలో చోటు కల్పించారు. రెండేళ్ల నుంచి లీగ్, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తున్నాను. జట్టులో రైట్ మిడ్‌ఫీల్డ్ స్థానంలో ఆడుతున్నాను. రెండు పర్యాయాలు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించాను. గత ఏడాది తమిళనాడులో జరిగిన జాతీయస్థాయిలో ఆడాను. ఆర్డీటీ ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయిని అందుకోవాలన్నదే లక్ష్యం.

- వినయ్ కుమార్‌రెడ్డి, అనంతపురం



జాతీయస్థాయిని అందుకున్నా

ఫుట్‌బాల్ అంటే పిచ్చి. ఐదో తరగతి చదివేటపుడే డీఎస్ఏ స్టేడియానికి సాధన వెళ్లాను. నా ఆసక్తిని శిక్షకుడు సిరాజ్ గుర్తించి వెన్నుతట్టి ప్రోత్సహించారు. నాన్న మురళి హమాలీ పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ప్రభుత్వ బడిలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. జట్టులో మిడ్‌ఫీల్డ్ స్థానంలో రాణిస్తున్నా. ఐదేళ్ల నుంచి సాధన చేయడం వల్ల రాటుదేలాను. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేస్తున్నాను. మధ్యప్రదేశ్, తమిళనాడులో జరిగిన జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో ఆడటం మరుపురాని అనుభూతి. చెన్నైలో గ్రామీణ లీగ్ పోటీల్లో పాల్గొన్నాను. ఏడు పర్యాయాలు రాష్ట్రస్థాయిలో ఆడి గుర్తింపు తెచ్చుకున్నా. భవిష్యత్తులో మెస్సీ లాంటి ఆటగాడిలా పేరు తెచ్చుకోవాలన్నదే నా ఆశయం.

- దీపక్‌చందు, విజయవాడ



మూడేళ్లలో జాతీయస్థాయి

మూడేళ్ల నుంచి ఫుట్‌బాల్ ఆడుతున్నా. నాన్న మున్సిపాల్టీలో స్వీపరుగా పనిచేస్తున్నారు. ఆయన ప్రోత్సాహంతోనే ఫుట్‌బాల్ నేర్చుకున్నా. పాఠశాల పీఈటీల ప్రేరణతో ఆటలో పట్టుసాధించాను. జట్టులో ఫార్వర్డ్ స్థానం నాది. బంతి దొరికితే ప్రత్యర్థి జట్టుకు అందకుండా పాసింగ్ అందిస్తాను. మూడేళ్లలో నాలుగు పర్యాయాలు రాష్ట్రస్థాయి పోటీలు ఆడాను. పాఠశాల క్రీడల ఫుట్‌బాల్ పోటీల్లో ఆడాను. గత ఏడాది తమిళనాడులో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆడాను. భవిష్యత్తులో ఫుట్‌బాల్ శిక్షకుడిగా ఎదిగి మంచి క్రీడాకారులను దేశానికి అందించాలన్నదే నా ఆశయం. - సుధాకర్, నరసరావుపేట

స్వచ్ఛ బంగారులోకం


చెన్నేకొత్తపల్లి బస్టాండులో..

ఆ పల్లెలు స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాయి. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించకుని ఆదర్శంగా నిలుస్తున్నాయి. స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమాలు కాస్త ఫలితాలను ఇస్తున్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. పాఠశాలల్లో కొత్తగా మరుగుదొడ్లు స్వచ్ఛతకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నివసించేది గుడిసెలోనే అయినా మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చి అందరికీ ఆదర్శంగా నిలస్తున్నారు కొందరు మహిళలు.

- ఈనాడు, అనంతపురం


చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్‌చెరువులో..


ధర్మవరం మండలంలోని ఓ పాఠశాలలో అధునికంగా..

పట్టుభద్రులు

- ఉన్నత విద్యలో రాణించారు..ఉన్న ఊరిలో ఉపాధి
- వ్యాపారానికి సాంకేతిక సొబగు


మగ్గం నేస్తున్న గౌతమ్

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టుచీరలు.. అనగానే గుర్తొచ్చే పేరు..ధర్మవరం..చేనేత రంగం..దేశానికే ఖ్యాతి తెచ్చిన నేర్పరితనం..నైపుణ్యం..మన కార్మికుల సొంతం..కాలక్రమేణా ఈ రంగంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఆధునికత ఈ రంగంలోనూ పెనుమార్పులు తెచ్చింది.. సంప్రదాయ కార్మికులకు కొంత దెబ్బ తగిలింది..అయితే తరతరాలుగా వృత్తినే నమ్ముకున్న కుటుంబాలు ఇందులోనే కొనసాగుతూ తమ పిల్లలను ఉన్నత విద్య చదివించాయి..వారు తమలాగా కష్టాలు పడకూడదని ఉద్యోగాలు స్థిరపడాలనుకున్నారు..కాని పట్టభద్రులైన యువత విభిన్నంగా ఆలోచించారు..వృత్తి నైపుణ్యానికి సాంకేతికత జోడించారు..తల్లిదండ్రులుగా వెన్నుదన్నుగా నిలిచారు..తాము సొంతంగా వ్యాపారాలు ప్రారంభించడమే కాక చిన్న తరహా పరిశ్రమలు ప్రారంభించి కార్మికులకు ఇక్కడే ఉపాధి కల్పించి ఈ రంగంపై సడలిపోతుందనుకున్న పట్టును బిగించారు..గత కొన్నేళ్లుగా ఈ వృత్తినే దైవంగా నమ్ముకొని వందల కుటుంబాలు జీవిస్తున్నాయి. ధర్మవరంలో దాదాపు 40 వేల మంది చేనేత రంగంలో ఉపాధి పొందుతున్నారు. వెయ్యికి పైగా పట్టు చీరల విక్రయ దుకాణాలు ఉన్నాయి. ప్రస్తుత కాలంలో సాంకేతికంగా పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. ఆన్‌లైన్ ద్వారా పట్టు చీరలు విక్రయాలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు ఆ సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో ఉన్నత విద్య చదివిన చేనేత వ్యాపారుల పిల్లలు నాన్నకు తోడుగా చేనేత రంగంలో అడుగుపెట్టి..ఉద్యోగాలకు వెదుకులాడకుండా..స్వశక్తిని నమ్ముకున్నారు..మరో పదిమందికి ఉపాధి చూపారు.అలాంటి పట్టభద్రులైన యువత విజయగాథే ఇది.



చేనేతకు ఏకీకృత పన్ను మినహాయించాలి



2015లో బీటెక్ చదివాను. ఉద్యోగ అన్వేషణ చేయకుండా నాన్నకు తోడుగా పట్టు చీరల వ్యాపార రంగంలో అడుగుపెట్టా. పద్మావతి హ్యాండ్‌లూమ్ పేరిట పరిశ్రమ ప్రారంభించా. అందులో 130 మంది కార్మికులకు ఉపాధి కల్పించా. ఎక్కడయినా ఉద్యోగం చేస్తే ఒత్తిడితో చేయాల్సి ఉంటుంది. నాన్న చేస్తున్న వృత్తిని దైవంగా భావించుకొని నాన్నకు తోడుగా చేనేత రంగంలో అడుగుపెట్టాను. నేను సొంతంగా బతకడమే కాక పలువురికి ఉపాధి కల్పిస్తున్నా. ఇప్పుడిప్పుడే చేనేత రంగంలో ఎంతో మంది యువత ఉపాధి పొందుతున్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి మినహాయించాలి.

- గౌతమ్

వలసలు నివారించగలిగా



నేను బీబీసీ చదివా. ఎక్కడా ఉద్యోగం కోసం వెతకకుండా పూర్వీకుల నుంచి వస్తున్న చేనేత రంగంలో వ్యాపారం చేస్తూ లాభాల బాట పట్టా. మా అమ్మానాన్న నా వ్యాపారానికి తోడుగా నిలుస్తున్నారు. ఈ రంగంలో ఎందరో కార్మికులను వలస వెళ్లకుండా ఉపాధి అవకాశాలు కల్పించగలిగానన్న సంతృప్తి ఉంది. మారుతున్న కాలానికి అభిరుచులకు అనుగుణంగా మనం మారితే ఎదుగుదలకు ఢోకా ఉండదు.

- అరవిందకుమార్

ఆన్‌లైన్‌లో వ్యాపారం విస్తరించాం



బీబీఏ పూర్తి చేశా. తమిళనాడులో ఒక కంపెనీలో ఉద్యోగంలో చేరా. నెలకు రూ 25 వేలు వేతనం వచ్చేది. స్వశక్తి మీద బతకాలని, పలువురికి ఉపాధి కల్పించాలని ఉద్యోగానికి స్వస్తి పలికా. పట్టు చీరల విక్రయంలోకి అడుగుపెట్టా. తల్లిదండ్రులు చేస్తున్న వృత్తిలో మరిన్ని మెలకువలు నేర్చా, ఆన్‌లైన్ ద్వారా పట్టుచీరల వ్యాపారాన్ని విస్తరించా. నాతోపాటు నా సోదరులు రంగనాథ్ (బీటెక్), ప్రసాద్ (బీకాం), రాజ్‌కుమార్ (బీబీఎం), రవితేజ (బీబీఎం) ఈ రంగంలోనే స్వయం ఉపాధి పొందుతున్నారు. తల్లిదండ్రులు చేస్తున్న చేనేత వృత్తినే దైవంగా భావించి ఇందులోనే స్థిరపడ్డాం. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి చేనేత రంగానికి ఉపశమనం కల్పించాలి.

- రాజేష్

ఉపాధి పనుల ప్రక్షాళనకు శ్రీకారం

•వివరాలు పుస్తకాల్లోకి • గ్రామ, మండల స్థాయిలో అమలుకు చర్యలు



పనులు చేస్తున్న కూలీలు

పుట్టపర్తి(గ్రామీణం), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద చేపట్టే ప్రతి పనికి వివరాలను పుస్తకాల్లోకి ఎక్కించాల్సి ఉంది. ఇప్పటికే మండల స్థాయిలో పంచాయతీలు, గ్రామాల వారీగా వివరాల నమోదుకు ఉపాధి సిబ్బంది కసరత్తు ప్రారంభించారు. టీఏలు, ఎఫ్‌ఏలు గత రెండు మూడు రోజులుగా కార్యాలయాల్లో కూర్చుని వివరాల నమోదులో తలమునకలయ్యారు.

ఇదీ ఉద్దేశం: ఉపాధి హామీ పథకం తమది కాదన్నట్లుగా వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులు పట్టించుకోవడంలేదు. ఆయా గ్రామాల్లో పనులు జరుగుతున్నా పంచాయతీ కార్యదర్శులు అటు కన్నెత్తి చూడటం లేదు. మండలంలో ఉపాధి పథకం కింద చేపట్టిన పనుల ప్రగతి, నాణ్యత కన్నా ఉద్యోగులు తయారు చేసిన దస్త్రాలపై సంతకాలు చేయడానికే మండల స్థాయి అధికారులు ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి పరిస్థితి భవిష్యత్తుల్లో ఉండకూడదని గ్రామ, మండల స్థాయి అధికారులకు పథకం పట్ల బాధ్యత పెంచాలని ఈవిధానం అమల్లోకి తెచ్చింది. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రతి పని వివరం కచ్చితంగా పుస్తకాల్లో నమోదు చేయాలని ఆదేశించింది. ఇక మీదట మండల స్థాయి అధికారి, పంచాయతీ కార్యదర్శి విధిగా పర్యవేక్షించాలన్నదే దీని ప్రధాన ఉద్దేశం.

గ్రామ స్థాయిలో 7 రిజిస్టర్లు: ఇందుకోసం గ్రామ స్థాయిలో ఏడు రిజిస్టర్లను పంచాయతీ కార్యదర్శి సమక్షంలో నిర్వహించాలి. ఇందుకు క్షేత్ర సహాయకుడు గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించేలా నిర్దేశించింది. ఇప్పటికే ఈ విధానం అమలుపై మండల స్థాయిలో నమోదు చేస్తున్నారు. జాబ్‌కార్డు రిజిస్టరు, గ్రామసభ, వర్క్, స్థిరాస్తి రిజిస్టర్లు రెండు, ఫిర్యాదుల రిజిస్టరు, డిమాండు వర్క్ రిజిస్టరులను నిర్వహించాలి.

తీసుకున్న చర్యల నమోదు: కూలీలు, ప్రజా సంఘాల ఫిర్యాదులు, ఆరోపణలపై నిఘా విభాగం, ఉన్నతాధికారులు చేసిన విచారణల తరువాత ఏం చర్యలు తీసుకున్నారో రిజిస్టరులో రాయాలి. ఆయా గ్రామాల్లో ఉపాధి పథకం చేపట్టిన, చేపట్టాల్సిన పనులు సమాచారం ఆ పంచాయతీ కార్యదర్శికి తెలిసే ఉండాలి. అలా కాని పక్షంలో ఉన్నతాధికారులు ఆ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటారు. పనులను పరిశీలించి నివేదిక ఇవ్వాలి. లోపాలు జరిగితే మండల స్థాయి అధికారులను, కార్యదర్శులను బాధ్యులను చేయనున్నారనే సమాచారంతో జాగ్రత్తగా మసలుకునేలా చూస్తున్నారు.

నమోదు చేయాల్సిన అంశాలు: 2014-15 నుంచి 2017-2018 ఆర్థిక సంవత్సరం వరకు ఉపాధి పథకం కింద చేపట్టిన పనులు, చెల్లించిన నిధులు, పనులకు వచ్చిన కూలీలు, మెటీరియల్ కాంపోనెంట్ కింద పంచాయతీలకు లభించిన నిధులు, ఆనిధులతో చేపట్టిన పనుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు కంప్యూటరీకరణ చేయాలి. జాబ్ కార్డుల మేరకు కూలీల వివరాలు, వారు ఆసక్తి చూపుతున్న పనుల వివరాలు నమోదు చేయాలి. వీటిని ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించాలి. ప్రతి మూడు నెలలకు ఓసారి నవీకరించాలి. కూలీల హాజరు, వేతనాల చెల్లింపులు, ఆయా గ్రామాల్లో పనులు, నాణ్యతకు సంబంధించి వివరాలు రాయాలి. సామాజిక తనిఖీ గ్రామ సభల్లో స్థానిక ప్రజలు లేవనెత్తిన అంశాలను, పథకం ఉద్యోగులు, అధికారులపై చేసిన ఆరోపణలపై సమగ్రంగా నమోదు చేయాలి.



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

భార్యాభర్తల తగాదాలు సున్నితం

● కౌన్సెలింగ్‌తోనే పరిష్కారం ● ఎస్పీ అశోక్‌కుమార్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: భార్యాభర్తల మధ్య తగాదాలు సున్నితమైనవి. ప్రేమ, ఆప్యాయతతో సమస్యను చూస్తే పరిష్కారమవుతాయని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని మహిళా సమస్యల పరిష్కార కేంద్రానికి ఆయన మంగళవారం వచ్చారు. అక్కడ భార్యాభర్తల మధ్య తలెత్తిన తగాదాలపై అధికారులు ఇస్తున్న కౌన్సెలింగ్ తీరుపై ఆరా తీశారు. కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు ఎలా పని చేస్తున్నారు. బాధితులకు ఏ తరహాలో న్యాయం జరుగుతుందన్న అంశంపై అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చిన భార్యాభర్తలతో ఆయన మాట్లాడారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ భార్యాభర్తలు ప్రేమ, ఆప్యాయతలతో మెలగాలన్నారు. కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కాకుండా ఆదర్శవంతంగా జీవితం గడపాలని సూచించారు. చిన్నపాటి పొరపాట్లు, ఇబ్బందులు ఉన్నా సర్దుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కేయూ ప్రొఫెసర్ కృష్ణానాయక్, ఐసీడీఎస్ కౌన్సెలర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడం

అనంతపురం (అరవిందనగర్), న్యూస్‌టుడే: కోర్కెల సాధన కోసం గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన దేశవ్యాప్త సమ్మె 7వ రోజుకు చేరింది. జీడీఎస్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా బుధవారం నుంచి తపాలా ఉద్యోగులు కూడా సమ్మె చేయనున్నారు. దీంతో ఉద్యమం తీవ్రం కానుంది. తపాలాశాఖ ఉన్నత యంత్రాంగం మాత్రం జీడీఎస్ ఉద్యోగులు విధులకు హాజరు కావాల్సిందేనని ఆదేశాలు జారీ చేస్తోంది. ఈ సందర్భంగా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ విధులకు హాజరుకాకపోతే ఉద్యోగం ఊడుతుందని హెచ్చరికలు జారీ చేస్తున్నారని, అలాంటి బెదిరింపులకు భయపడేది లేదన్నారు. సమ్మెను నీరుకార్చే ప్రయత్నాలకు స్వస్తి పలకాలన్నారు. అధికారుల బెదిరింపులకు భయపడాల్సిన పని లేదన్నారు.

కియా పనులు పరిశీలించిన కలెక్టర్



వివరాలు తెలుసుకొంటున్న కలెక్టర్

పెనుకొండ పట్టణం న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రమంచి గ్రామంలో జరుగుతున్న కియా కార్ల పరిశ్రమ భూమి చదును పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ వీరపాండియన్ పరిశీలించారు. అనంతరం దుద్దేబండ కూడలి వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమై పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మొత్తం 600 ఎకరాల భూమి ఐదు దశల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఎల్‌అండ్‌టీ సంస్థ ద్వారా భూమి చదును పనులు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు మొదటి దశలో 80 ఎకరాలు చదును పూర్తయిందన్నారు. మొత్తం ఐదు దశల్లో మట్టి తొలగింపు పనులు పూర్తయ్యాయి. బండరాయి ఉన్నచోట పేలుడు ద్వారా తొలగిస్తున్నారని అన్నారు. రక్షణ చర్యలపై ఏపీఐఐసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దుద్దేబండ కూడలి సమీపంలో టౌన్‌షిప్ వద్ద జరుగుతున్న పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జీఎం రఘునాథ, డీజీఎం హరిధర్‌రావు, పెనుకొండ ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ హసీనాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా నివేదికలు ఇవ్వండి



పీడీ నాగన్న

జిల్లా వ్యవసాయం, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగు వివరాలన్నీ పక్కాగా అందజేయాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మా) పథక సంచాలకులు నాగన్న ఆదేశించారు. ఆత్మా పథకాలపై మంగళవారం ఆశాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ నాగన్న మాట్లాడుతూ జిల్లాలోని 20 క్లస్టర్లలో 12 స్వచ్ఛంద సంస్థలు చిరుధాన్యాల సాగు కార్యక్రమం కింద పనిచేస్తున్నారు. ఆత్మా ద్వారా రూ. లక్షలు వివిధ పథకాలకు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటికే ఖరీఫ్ పంట కాలం గడిచిపోతుంది. చిరుధాన్యాల సాగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఖరీఫ్‌లో నవధాన్యాలు పంపిణీ కూడా స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాం. అయితే ఇప్పటి వరకు ఏయే మండలాల్లో ఎంతెంత సాగు చేశారన్న వివరాలను ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. అన్ని వివరాలు వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీడీ అనూరాధ, సహాయకులు నాగమణి, సుధాకర్, ఏటీఎంలు, బీటీఎంలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

24న ప్రైవేటు విద్యాసంస్థల బంద్

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లపై దాడికి నిరసనగా ఈనెల 24న జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంద్ చేయాలని నిర్ణయించారు. అందరూ సహకరించాలని నాయకులు పుల్లారెడ్డి, ఇక్బాల్, నాయుడు, రామిరెడ్డి తదితరులు తెలిపారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

అనంతపురం ఆర్టీసీ, న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని ఈయూ నాయకులు పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ అధ్యక్షుడు జీవీపీరావు ఆధ్వర్యంలో నగరంలోని హెచ్చెల్సీ కాలనీ సమీపాన వీకే భవన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ కార్మికుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని, యూనియన్ చేపట్టనున్న పథకాలను కార్మికులకు చేరువ చేయాలన్నారు. ధర్మవరం, కళ్యాణదుర్గం డిపో మేనేజర్లు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అన్ని డిపోల ముందు 24న ధర్నాలు, 26న ధర్మవరం డిపో వద్ద దీక్ష చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైవీరావు, ప్రసాదరెడ్డి, నరసయ్య, ఏఐటీయూసీ నాయకులు రాజారెడ్డి, అన్ని డిపోల నాయకులు, అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

నలుగురు తహసీల్దార్ల బదిలీ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రెవెన్యూశాఖలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ మంగళవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో పెనుకొండ ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న ఎం.జి.సరస్వతిని ధర్మవరం ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారిగాను, తాడిమర్రి మండల తహసీల్దారు పి.సుబ్బలక్ష్మమ్మను అమడగూరుకు, కదిరి మండల తహసీల్దార జి.రామకృష్ణారెడ్డిని డ్వామా ఏపీడీగా, గుంటూరులోని సీఆర్‌డీఏ తహసీల్దారుగా పనిచేస్తున్న జి.వసంతను కదిరి ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారిగా బదిలీ చేశారు. వారంతా తక్షణమే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు.

విజ్జి ట్రోఫీ క్రికెట్ పోటీలకు ముగ్గురి ఎంపిక

అనంతపురం క్రీడలు: దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మకమైన విజ్జిట్రోఫీ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రికెటర్లు ఎంపికయ్యారు. రంజీ, ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ క్రీడాకారులు గతేడాది చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. రంజీల్లో ఓపెనర్ ప్రశాంత్‌కుమార్, ఆంధ్ర అండర్-19 జట్టులో ఆల్‌రౌండరు గిరినాథ్‌రెడ్డి, బౌలరు షోయబ్‌ఖాన్ విజ్జిట్రోఫీ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి షాబుద్దీన్ తెలిపారు. ఈ పోటీలు ఈనెల 28 నుంచి విజయనగరం జిల్లాలో నిర్వహించనున్నారు. అలాగే హైదరాబాద్‌లో జరగనున్న మొయినుద్దౌల్లా క్రికెట్ పోటీలకు గిరినాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వీరి ఎంపిక పట్ల జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు మాంచోఫెర్రర్ హర్షం వ్యక్తం చేశారు.

'అనంత'లో స్వచ్ఛ రైలు

అనంతపురం(రైల్వే), న్యూస్‌టుడే: రైల్వేలో స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నామని సీనియర్ డివిజన్ ఆపరేటింగ్ మేనేజర్(డీవోఎం) ఆంజనేయులు తెలిపారు. స్వచ్ఛ భారత్ పక్షోత్సవాల్లో భాగంగా అనంత రైల్వే స్టేషన్‌లో మంగళవారం 'స్వచ్ఛ రైలు బండి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మవరం నుంచి విజయవాడకు వెళ్లే 17216 రైలును అనంతలో కాసేపు ఆపి బోగీలను పరిశీలించారు. బోగీలలో స్వచ్ఛతపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ తిప్పానాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు అశోక్, శర్మ, అనిల్‌కుమార్, శివరంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో కేసుల ఛేదింపు

మూడోరోడ్డు(అనంతపురం), న్యూస్‌టుడే: సాంకేతికతతో నేరాల ఛేదింపు, దర్యాప్తు సులభతరం అవుతుందని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. సాంకేతికతపై సైబర్ పోలీసు స్టేషన్‌లో శిక్షణ పొందుతున్న సిబ్బందితో ఆయన మంగళవారం మాట్లాడారు. సబ్ డివిజన్ల వారీగా కొంతమంది కానిస్టేబుళ్లను ఎంపిక చేసి మూడు రోజులుగా సైబర్ నేరాలు, దర్యాప్తుపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ నాగసుబ్బన్న, ఎస్బీ ఇన్‌స్పెక్టరు రాఘవన్ సైబర్ ఠాణా ఎస్సైలు జాకీర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కరవు సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: కరవు సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంతో చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు కోటసత్యం విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో సాగు చేసిన పంటలు పదేళ్లుగా చేతికి అందకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక, పొట్టకూటి కోసం పట్టణాలకు అన్నదాతలు వలస వెళ్తున్నారన్నారు. కరవు మండలాలుగా ప్రకటించి ఎనిమిది నెలలవుతున్నా సహాయక చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు సాగుచేయని, రైతులకు చిరుధాన్యాల సాగు చేసుకునేందుకు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పశుగ్రాసం కొరతతో పాడిపశువులను కబేళాలకు తరలిస్తున్నా, నేటికి ప్రభుత్వం గడ్డి కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు. ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నా, పాలకులు, అధికారులు స్పందించడం లేదన్నారు. నంద్యాల ఉప ఎన్నికలపై ఉన్న శ్రద్ధ, జిల్లా ప్రజలపై లేదన్నారు. హంద్రీనీవా కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయని, 9వ ప్యాకేజీలో నేటికీ భూసేకరణ జరగలేదని, అవసరమైన నిధులు కేటాయించి, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తెదేపా అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు.

ఇరుకిరుకు!



రాయదుర్గం: స్థానిక కుంబారుగుండులో ప్రీస్కూలులో చాలీచాలని గదిలోనే భోజనాలు చేస్తున్న చిన్నారులు. ఇక్కడి అద్దె గదిలోని పాఠశాలకు రంగులు కూడా వేయలేదు. విద్యాబోధనకు అవసరమైన కిట్‌లు, కుర్చీలు, గాలిపంకాలను కూడా సరఫరా చేయలేదు. ఒక టీవీ మాత్రమే సరఫరా చేశారు. నెలకు రూ.4 వేల బాడుగ చెల్లిస్తున్నా రెండు ఇరుకు గదుల్లో మూడు తరగతుల నిర్వహణ కష్టంగా మారింది.

లక్ష్యం మూలకు నెట్టేశారు

రాయదుర్గం: అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో విద్యా బోధనకు ఉపయోగించే కిట్‌లు, పుస్తకాలను అందుబాటులోకి తేకుండా మూలనపడేశారు. ఇదంతా రాయదుర్గం పట్టణంలోని వేంకటేశ్వర పాఠశాలలోని ప్రీ స్కూల్‌లోని విచిత్రం. 'న్యూస్‌టుడే' పరిశీలనకు వెళ్లిన సమయంలో వీటిని తెరిచి అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేయడం గమనార్హం.



విలీనం... కష్టాలు సజీవం!

◆ నామమాత్రంగా ఆంగ్ల మాధ్యమం ◆ ఒనగూరని మౌలిక వసతులు..

◆ క్షేత్ర స్థాయిలో తీవ్ర నిర్లక్ష్యం ◆ చిన్నారి సంక్షేమానికి అవాంతరం



అనంతపురంలో ఒకే కేంద్రంలో రెండు అంగన్‌వాడీలు

పరిశీలన

" అంగన్‌వాడీ కేంద్రాల విలీనం.. ఆంగ్ల మాధ్యమ నిర్వహణ అస్తవ్యస్తంగా.. గందరగోళంగా మారింది. ఈ ప్రక్రియపై స్పష్టమైన వివరాలేవీ అందుబాటులో లేకపోవడంతో ఈ క్రతువు ఏ స్థాయిలో ఉందో అవగతం అవుతోంది. క్షేత్ర స్థాయిలో సీడీపీవో, పర్యవేక్షకులు ఏమాత్రం పట్టించుకోలేదు. ఇష్టమొచ్చినట్లు 'లెక్క'లు రాసి పంపిస్తున్నారు. వీరి నిర్వాకంతో పీడీ కార్యాలయ సిబ్బంది తలపట్టుకుంటున్నారు. సాక్షాత్తు ఆ శాఖ మంత్రి సొంత జిల్లాలో ఇలా దయనీయంగా మారడం విశేషం. 50 రోజులు గడుస్తున్నా ఇంకా ఓ కొలిక్కి రాలేదు. ఆంగ్ల మాధ్యమాన్ని నిర్వహించడానికి అంగన్‌వాడీ కార్యకర్తల్లోనూ ఆసక్తి, శ్రద్ధ లేదన్నది వాస్తవం. వెరసి సీడీపీవో, పర్యవేక్షకుల్లోనూ నిరాసక్తత నెలకొన్నట్లు తెలుస్తోంది." – న్యూస్‌టుడే, అనంతపురం (శ్రీనివాసనగర్)

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ విలీన ప్రక్రియపై స్పష్టమైన వివరాలేవీ పీడీ కార్యాలయానికి అందలేదు. నిర్దేశిత ప్రొఫార్మా ఇక్కడి నుంచి పంపినా సీడీపీవోల్లో బాధ్యత, జవాబుదారీ లేనట్లు తేటతెల్లమైంది. ఎన్ని విలీనం చేశారు? ఆంగ్ల మాధ్యమం తీరు ఎలా ఉందనే దానిపై పక్కా వివరాలు పంపలేదు. ప్రాజెక్టు పరిధిలో ఉన్న కేంద్రాల సంఖ్యను లేదా పట్టణాల్లో మొత్తం సంఖ్యను పంపారు. విలీనం ఎన్ని చేశారనేది మాత్రం స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. ఇక ప్రాజెక్టుల పరిధిలో నిర్వహణ, పరిపాలన ఎలా ఉందో తెలుస్తోంది. నిత్యం సీడీపీవో కార్యాలయాలకు ఫోన్లు చేస్తున్నా స్పందన కరవు.

విలీనం విస్తరణ...

జిల్లాలో 17 ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 5,126 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో తొలి విడతగా పది పట్టణాల్లో 636 కేంద్రాలను 318 కేంద్రాలల్లో విలీనం చేయాలని సంకల్పించారు. ఇక్కడ 8,575 మంది పిల్లలు ఉన్నట్లు లెక్కలు నమోదు చేశారు. కానీ ఇప్పటి దాకా 144 కేంద్రాలను మాత్రమే విలీనం చేసినట్లు చూపిస్తున్నారు. హిందూపురం, పెనుకొండ, గుంతకల్లు, రాయదుర్గం, అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం, మడకశిర, కదిరి, కళ్యాణదుర్గం, పామిడి, పుట్టపర్తి మున్సిపాల్టీల్లో విలీన ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. ధర్మవరంలో ఎన్ని విలీనం చేశారని అడిగితే ఏకంగా 333 చేసినట్లు చూపించారు. ప్రాజెక్టు పరిధిలో సంఖ్యను పంపారు. ఈ తతంగం సాగుతుండగానే... అన్ని మండల కేంద్రాల్లో, ప్రధాన పంచాయతీల పరిధిలోని కేంద్రాలను కూడా విలీనం చేయాలంటూ రెండో విడతగా ఆదేశాలు వచ్చాయి. ఇప్పటి దాకా మండల కేంద్రాలల్లో 464, పంచాయతీల పరిధిలో 698 కేంద్రాలను విలీనం చేసినట్లు చెబుతున్నా... ఇదంతా పక్కాగా లేదు. తూతూమంత్రంగా లెక్కలతో సరిపుచ్చుతున్నారు.



ఆంగ్ల బోధన పుస్తకాలు

అటకెక్కిన ఆట వస్తువులు...

విలీన ప్రక్రియ వ్యవహారం ఇలా ఉంటే... ఆంగ్ల మాధ్యమ బోధన మరీ దారుణంగా మారింది. మూడు కేంద్రాలను ఒక కేంద్రంగా విలీనం చేసిన చోట విధిగా రంగులు వేయాలి. టెలివిజన్ ఉండాలి. మూడు గదులు, ఒక వంట గది తప్పనిసరి. రంగులు, బొమ్మలు వేయించాలి. ఇదంతా ఆయా మున్సిపల్ కమిషనర్లదే బాధ్యత. అనంత నగరంలో తొమ్మిది కేంద్రాలను మాత్రమే మూడు చొప్పున కలిపారు. ఉమానగర్, ఇందిరానగర్, రాణినగర్‌లో ఉన్నాయంతే. రెండ్రెండు చొప్పున ఎన్ని ఉన్నాయో తెలీదు. ఇలా జిల్లాంతటా ఇదే దుస్థితి. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను నిర్వహించాలని సూచించారు. దీనికి ఒక్కో విద్యార్థికి ఒక పుస్తకం చొప్పున సరఫరా చేశారు. వీటిని పిల్లలకు ఇచ్చి భర్తీ చేయించాలి. కానీ... చాలా అంగన్‌వాడీ కేంద్రాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని బోధించలేదు. ఎందుకంటే... పద్యాల గురించి మాకే నోరు తిరగడం లేదు. ఇక పిల్లలకు ఎలా చెప్పాలంటూ ఓ కార్యకర్త వాపోయారు. ఆట వస్తువులను సరఫరా చేశారు. చాలా చోట్ల వాటిని అటకెక్కించారు. కేంద్రాల నిర్వహణ దయనీయంగా మారినా పర్యవేక్షణ చాలా వరకు మందగించింది.



పైఅంతస్తుతో పాట్లు

ధర్మవరం పట్టణం: ధర్మవరంలోని లోనుకోట కాలనీలో మూడు కేంద్రాలు ఒకటిగా చేశారు. పై అంతస్తులో కేంద్రం నిర్వహిస్తున్నారు. విద్యార్థులు పైకి వెళ్లడానికి ఇక్కట్లు పడుతున్నారు. గాలి వెలుతురు సైతం సక్రమంగా లేదు. ఈ ఇరుకిరుకు గదిలో బోధిస్తున్నారు. పక్కన నాణ్యమైన పక్కా భవనం ఉన్నా నిరుపయోగంగా ఉంది.

పర్యవేక్షణ పెంచి సమర్థ సేవలు

జూన్ నుంచి విలీనం చేస్తున్నాం. గతేడాదిలోనూ కొన్నింటిని చేశాం. పట్టణాల్లో కొంతమేర ఇబ్బందిగా ఉంది. అద్దె ఇళ్లు దొరకాలంటే కష్టంగా ఉంది. మూడు చొప్పున ఒకటిగా విలీనం చేసిన వాటికి రంగులు వేయించాం. టీవీలను కూడా ఏర్పాటు చేయించాం. రెండ్రెండు, ఒక్కోటి ఎన్నెన్ని అన్న వివరాలను సీడీపీఓల నుంచి అడిగాం. ఈ ప్రక్రియ ఇంకా నడుస్తోంది. ఆంగ్ల మాధ్యమం పక్కాగా అమలు అవుతోంది. కేంద్రాల పరిశీలన చేయాలని సీడీపీవో, పర్యవేక్షకులను ఆదేశించాం. ఈ కార్యక్రమం నడుస్తోంది. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే మా దృష్టికి తీసుకుని రావాలని కూడా చెప్పాం.

- కృష్ణకుమారి, ఇన్‌ఛార్జి పీడీ, ఐసీడీఎస్

చౌరవ చూపితే వెలుగు



పామిడి: పామిడి-4, పామిడి-5, తగ్గుదేవాలయం లోని కేంద్రాలను విలీనం చేసి పామిడి వార్డు ప్రాథమిక పాఠశాలలో ఒక తరగతి గదిలో ప్రీ స్కూల్ నిర్వహిస్తున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు జరుగుతున్నాయి. కమిషనరు నాసిర్‌హుస్సేన్ దాతల సహకారంతో కుర్చీలు, బల్లలు, టీవీలు తదితర వస్తువులను సమకూర్చారు. గది లోపల గోడల చుట్టూ ఆకర్షించే బొమ్మలు, గది బటయ గోడలకు రంగులు వేయించి వివిధ రకాల బొమ్మలతో తీర్చిదిద్దారు. ఇలా ఇప్పటి వరకు పట్టణంలో రెండు ప్రీ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేశారు.

80 కాదు.. 30 మందే!

తాడిపత్రి: మీరు చూస్తోంది.. తాడిపత్రి పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న ప్రీ స్కూల్. ఇక్కడకు జయనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంతోపాటు అంబేడ్కర్ నగర్‌లో ఉన్న మరో రెండు కేంద్రాలను విలీనం చేశారు. ఒక్కో కేంద్రంలో 20 మంది చిన్నారుల వంతున ఇక్కడ 80 మంది ఉండాలి. కానీ.. ప్రస్తుతం 30 మంది చిన్నారులు మాత్రమే వస్తున్నారు. ఈ నాలుగు కేంద్రాలను కలిపి ఒక చిన్న గదిలోనే ఉంచి అక్షరభ్యాసం, పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ, నర్సరీ తరగతులన్నీ ఒకే గదిలోనే నిర్వహిస్తుండటంతో గందరగోళం తప్పడం లేదు.





ప్రకాశం, చిత్తూరు జట్ల మధ్య పోటీ

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ పోటీల సెమీఫైనల్లోకి అనంతపురం, కడప, విశాఖ, చిత్తూరు జట్లు ప్రవేశించాయి. మంగళవారం అనంత క్రీడా గ్రామంలో జరిగిన లీగ్ పోటీల్లో ఆయా జట్లు ప్రత్యర్థులను చిత్తుచేసి సెమీస్‌కు దూసుకెళ్లాయి. ఉదయం జరిగిన పోటీలో అనంతపురం జట్టు 7-1 గోల్స్ తేడాతో నెల్లూరు జట్టును ఓడించింది. ఆట ప్రథమార్ధం నుంచి అనంతపురం ఆటగాళ్లు చెలరేగి ఆడటంతో నెల్లూరు జట్టు కుదేలయింది. రంగస్వామి (3 గోల్స్), శ్రీహరి, ప్రశాంత్ చెలరేగడంతో అనంతపురం జట్టుకు విజయం సులువైంది. మరో పోటీలో కడప జట్టు తూ.గోదావరి జట్టుపై 5-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. బాష, జగదీష్, రాజేష్ చక్కటి ఆటతీరుతో జట్టును విజయతీరాలకు చేర్చారు. ఇంకో పోటీలో చిత్తూరు జట్టు గుంటూరును 2-0 గోల్స్‌తో ఓడించి సెమీఫైనల్లో ప్రవేశించింది. ఇంకో లీగ్ పోటీలో విశాఖ జట్టు కర్నూలు జట్టుపై 1-0తో పోరాడి గెలిచింది. చిత్తూరు జట్టు మరో పోటీలో 17-0తో ప్రకాశం జట్టును ఓడించింది. బుధవారం సెమీఫైనల్ పోటీల్లో అనంతపురం జట్టు కడపతో, విశాఖ జట్టు చిత్తూరుతో తలపడతాయి.

పదోతరగతి

సాంఘికశాస్త్రం

భారతదేశం - భౌగోళిక స్వరూపాలు

ఒక మార్కు ప్రశ్నలు

★ కింది పటాన్ని గమనించి ఇచ్చిన ప్రశ్నకు జవాబివ్వండి.



ప్ర: దక్కన్ పీఠభూమి సరిహద్దులను రాయండి.

జ. ఉత్తరాన: సాత్పురా పర్వతాలు, దక్షిణాన: నీలగిరి పర్వతాలు, తూర్పున: తూర్పు కనుమలు; పశ్చిమాన: పశ్చిమ కనుమలు దక్కన్ పీఠభూమికి సరిహద్దులుగా ఉన్నాయి.

★ కింది పటాన్ని గమనించి ఇచ్చిన ప్రశ్నకు జవాబివ్వండి.

హిమాలయాలు - సమాంతర శ్రేణులు

	హిమాద్రి శ్రేణి	నిమ్న హిమాలయాలు	శివాలిక్ శ్రేణి
ఎత్తు	6100 మీ.	3700–4500 మీ.	900 – 1100 మీ.
ఉనికి	హిమాలయాల్లో అన్నిటి కంటే ఉత్తరాన ఉంది.	హిమాద్రి, శివాలిక్ శ్రేణుల మధ్యలో ఉంది.	అన్నింటి కంటే దక్షిణాన ఉన్న శ్రేణి

ప్ర: హిమాలయాల్లో ఎత్తయిన పర్వత శ్రేణి ఏది? దానికి ఉన్న మరో పేరేమిటి?

జ. 'హిమాద్రి శ్రేణి' హిమాలయాల్లో ఎత్తయిన పర్వత శ్రేణి. దీనికి మరోపేరు 'ఉన్నత హిమాలయాలు.'

★ పాఠ్యపుస్తకంలో అభ్యాసాల్లో ఇచ్చిన ప్రశ్నలను ఉన్నవి ఉన్నట్లుగా పబ్లిక్ పరీక్షల్లో ఇవ్వరు. వాటిలో చాలా తక్కువ శాతం ప్రశ్నలు మాత్రమే రావచ్చు. కాబట్టి ఇచ్చిన ప్రశ్నల స్వభావం తెలుసుకుని, జవాబులు రాయాలి.

★ ఒకే ప్రశ్నను వివిధ రూపాల్లో అడిగే అవకాశం ఉంది. జవాబు చదివే సమయంలోనే దానిపై రకరకాల ప్రశ్నలను తయారు చేసి పెట్టుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది.

★ ఏ ప్రశ్నకు ఏ జవాబు రాయాలో, ఎలా రాయాలో తెలుసుకుని వాటిపై పట్టు సాధిస్తే పరీక్షలో ఎలాంటి ప్రశ్నకైనా తేలికగా జవాబు రాయగలుగుతారు.

ప్రతిభ

దేశంలో అత్యంత పొడవైన కాలువ..?



రచయిత
బొమ్మిడి నారాయణరావు
విషయ నిపుణులు

ప్ర: దేశంలో అత్యంత పొడవైన కాలువ ఏది? ఇది ఏ రాష్ట్రానికి నీరు అందిస్తుంది?

జ. దేశంలో అత్యంత పొడవైన కాలువ ఇందిరా గాంధీ కాలువ. ఇది ముఖ్యంగా రాజస్థాన్‌కు నీరు అందిస్తుంది.

ప్ర: శివాలిక్ పర్వతాలకు వివిధ ప్రాంతాల్లో ఉన్న పేర్లను తెలపండి.

జ. జమ్మూ ప్రాంతంలో జమ్మూ కొండలనీ, అరుణాచల్ ప్రదేశ్‌లో మిష్మి కొండలనీ, అసోంలో కచార్ అనీ పిలుస్తారు.

ప్ర: డూన్ అంటే ఏమిటి? ఉదాహరణ ఇవ్వండి.

జ. నిమ్న హిమాలయాలు, శివాలిక్ శ్రేణుల మధ్య ఉండే లోయలను స్థానికంగా 'డూన్'లు అంటారు

ఉదా: డెహ్రాడూన్.

ప్ర: 'భారతదేశం ద్వీపకల్పం' అనే పదాన్ని తరచూ ఎందుకు ఉపయోగిస్తారు?

జ. భారతదేశానికి మూడువైపులా నీరు ఉన్న కారణంగా, దక్షిణ భారతదేశాన్ని ఉద్దేశించి 'ద్వీపకల్పం' అనే పదాన్ని తరచూ ఉపయోగిస్తారు.

ప్ర: అండమాన్ నికోబార్ దీవుల్లో అగ్ని పర్వతాల వల్ల ఏర్పడిన దీవులేవి?

జ. నార్కోండం, బారెన్ దీవులు అగ్ని పర్వతాల వల్ల ఏర్పడ్డాయి.

ప్ర: ప్రపంచ పటంలో భారతదేశాన్ని గుర్తించాలంటే ఏయే అక్షాంశ, రేఖాంశాలు మనకు తెలియాలి?

జ. $8^\circ 4' - 37^\circ 6'$ ఉత్తర అక్షాంశాలు, $68^\circ 7' - 97^\circ 25'$ తూర్పు రేఖాంశాలు మనకు తెలిస్తే, ప్రపంచ పటంలో భారతదేశాన్ని సులభంగా గుర్తించవచ్చు.

ప్ర: రెండు నదుల మధ్య ప్రాంతాన్ని ఏమని అంటారు?

జ. రెండు నదుల మధ్య ప్రాంతాన్ని 'అంతర్వేది' అని అంటారు.

ప్ర: గోవా వెళితే మనకు తారసపడే తీర ప్రాంతమేది?


జ. గోవా వెళితే మనకు కొంకణ తీరం తారసపడుతుంది.

ప్ర: పూర్వాంచల్ పర్వతాలు అని వేటిని పిలుస్తారు?

జ. భారతదేశానికి తూర్పు సరిహద్దుగా ఉన్న హిమాలయాలను పూర్వాంచల్ పర్వతాలు అంటారు.

ప్ర: కింది చిత్రంలో పేర్కొన్న పగటి సమయాలను పరిశీలించి, వాటికి సంబంధించిన నగరాలను (ఢిల్లీ, లండన్) గడుల్లో రాయండి.

జ.



నాలుగు మార్కుల ప్రశ్న

ప్ర: 'భారతదేశంలోని మైదాన ప్రాంతాలు వ్యవసాయానికి దోహదపడినంతగా పీఠభూమి ప్రాంతాలు తోడ్పడవు' - ఈ వాక్యాన్ని ఎలా సమర్థిస్తారు?

జ. హిమాలయ నదులైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర వాటి ఉప నదుల వల్ల విశాల ఉత్తర మైదానం ఏర్పడింది. హిమాలయాల నుంచి వచ్చే ఈ నదులు తెచ్చిన రకరకాల ఒండ్రుమట్టి వల్ల ఇది క్రమేపీ పూడుకుంటూ వచ్చింది. అందువల్ల ఇక్కడి నేలలు అధిక భూసారంతో ఉండి, ఎక్కువ దిగుబడిని ఇస్తాయి.

- పీఠభూమి ప్రాంతాలు అగ్నిపర్వత శిలలతో ఏర్పడ్డాయి. ఇవి ఉత్తర మైదాన ప్రాంతాలంత సారవంతమైనవి కావు.
- ఉత్తర మైదాన ప్రాంతంలో ప్రవహించే నదులు జీవ నదులు. ఇవి ఎప్పుడూ నీటితో ఉంటాయి.
- దక్కన్ పీఠభూమి ప్రాంతంలో ప్రవహించే నదులు జీవ నదులు కావు. ఇక్కడ రెండో పంటకు సాగు నీటి కోసం చెరువులు, బోరు బావులపై ఆధారపడవలసి వస్తుంది.
- మైదాన ప్రాంతాల్లో ఉన్న సౌకర్యాలు పీఠభూమి ప్రాంతాల్లో ఉండవు. అందువల్ల 'భారతదేశంలోని ఉత్తర మైదాన ప్రాంతాలు వ్యవసాయానికి దోహదపడినంతగా పీఠభూమి ప్రాంతాలు తోడ్పడవు' అనే వాక్యాన్ని నేను సమర్థిస్తాను.

ముఖ్యమైన ప్రశ్నలు

1) తూర్పు, పశ్చిమ తీర మైదాన ప్రాంతాల మధ్య పోలికలు, తేడాలను రాయండి.
2) హిమాలయాలు భారతదేశానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి?
3) భాబర్, టెరాయిల మధ్య తేడాలను రాయండి.

BANK EXAMS

General Awareness

Sovereign Gold Bonds issued by..



Writer:
A. Veeraswami
Subject Expert

1. Sovereign Gold Bond 2017 – 2018 Series II issued as per the announcement of RBI on 6 July 2017. These bonds issued by RBI on behalf of ....
1) SBI 2) World Bank
3) Muthoot Finance
4) Government of India 5) SEBI

2. The SGB (Sovereign Gold Bond) issued to the buyers on ....
1) 23 July 2) 31 July 3) 1 August
4) 13 July 5) 28 July

3. The RBI sold the SGB to buyers through .....
1) banks 2) designated Post Offices
3) recognized Stock Exchanges
4) Stock Holding Corporation of India Limited (SHCIL) 5) All of above

4. The person / entity eligible to buy SGB Bonds is / are ....
1) Individuals 2) HUFs 3) Trusts
4) Universities and Charitable Institutions
5) All of above

5. SGB will be denominated in multiples of gram(s) of gold with a basic unit of ....
1) 3 grams 2) 8 grams 3) 10 grams
4) 1 gram 5) 12 grams

6. Under the Sovereign Gold Bond 2017 - 18 Series II, instead of buying physical gold, Indian residents can buy the Gold Bonds. These Bonds would be issued for the term of 8 years with exit option from ....
1) 5th year 2) 1st year 3) 4th year
4) 2nd year 5) 3rd year

7. Maximum amount of gold that can be subscribed by person / HUF per fiscal year under SGB scheme as announced on 26 July 2017 is ....
1) 100 gms 2) 1000 gms 3) 4000 gms
4) 2000 gms 5) 250 gms

8. Maximum amount of gold that can subscribe by trust and similar entities in SGB scheme as per the notification given by the government is ....
1) 50 kgs 2) 80 kgs 3) 20 kgs
4) 40 kgs 5) 30 kgs

9. Wrong statement regarding SGB (Sovereign Gold Bond) scheme is ....
1) Bonds are eligible for conversion into DEMAT form
2) Bonds will be tradable on stock exchanges
3) the interest accrued on Gold Bonds shall not be taxable under Income Tax Act,1961
4) Capital gains tax arising on redemption of SGB to an individual has been exempted
5) KYC (Know Your Customer) compulsory to buy

10. Under the Sovereign Gold Bonds 2017-18 Series Scheme, investors earn interest rate up to .... payable semi-annually on the initial value of investment.
1) 2.50 % per annum 2) 1.50 % per annum
3) 8.50 % per annum 4) 4.50 % per annum
5) 7.50 % per annum

11. SGB can be used as collateral for loans and for this purpose LTV ratio is to be set equal to ordinary gold loan mandated by the RBI from time to time. In this context, LTV stands for ....
1) LIBOR-to-value 2) linked-to-value
3) liability-to-value 4) loan-to-value
5) locker rent-to-value

12. On 6 July 2017, RBI released Compendium of Guidelines for Small Finance Banks - Financial Inclusion and Development. As per it, Small Finance Banks required to open at least .... of its branches in unbanked rural centers
1) 5% 2) 40% 3) 50% 4) 15% 5) 25%

13. Small Finance Banks required to extend 75% of its ANBC to priority sector. In this context, ANBC stands for ....
1)Average Net Bank Credit
2)Adjusted Net Batch Credit
3) Adjusted Nil Bank Credit
4) Adjusted Net Bank Credit
5) Allotment Net Bank Credit

14. Total Agricultural advances must be .... of ANBC given by Small Finance Banks
1) 24% 2) 60% 3) 15% 4) 32% 5) 18%

15. Within the 18 percent target for Agriculture, a target of .... of ANBC is prescribed for Small and Marginal Farmers by Small Banks.
1) 4% 2) 6% 3) 8% 4) 2% 5) 1%

16. Advances to weaker sections is the part of Priority Sector holding. What percentage of ANBC must be given to weaker section people by the Small Finance Banks (SFB)?
1)10% 2) 20% 3) 25% 4) 15% 5) 12%

17. A target of .... percent of ANBC must be given to micro enterprises as part of Priority Sector Lending by SFBs.
1) 7.5% 2) 10.5%
3) 6.8% 4) 8.2% 5)10.5%

18. Operating Guidelines for Small Finance banks issued by RBI on 6 October 2016. The guidelines for Licensing of Small Finance Banks earlier passed by RBI on...
1) 1 June 2016 2) 26 February 2016
3) 1 February 2014 4) 21 December 2015
5) 27 November 2014

19. Minimum Capital Requirement for Small Finance Banks is .... as per the guide lines issued on 6 October 2016.
1) 9% 2) 10% 3) 15% 4) 21% 5) 11.5%

20. Tier 1 common capital ratio is a measurement of a bank's core equity capital compared with its total risk-weighted assets that signifies a bank's financial strength. As per operating guidelines, for Small Finance Banks, the Common Equity Tier 1 is .... ?
1) 7% 2) 8.5% 3) 10% 4) 9.8% 5) 6%

21. The Minimum paid-up equity capital for small finance banks shall be.....?
1) Rs.1,000 crore
2) Rs.5,000 crore 3) Rs.500 crore
4) Rs.10 crore 5) Rs.100 crore

Key

1-4	6-1	11-4	16-1	21-5.
2-5	7-3	12-5	17-1	
3-5	8-3	13-4	18-5	
4-5	9-3	14-5	19-3	
5-4	10-1	15-3	20-5	

ప్రతిభ

ఉద్యోగాలు Jobs



భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్

బెంగళూరులోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ టెక్నికల్ అప్రెంటిసెస్ (డిప్లొమా హోల్డర్లు) పోస్టుల భర్తీకి వాక్- ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనుంది.

- ✦ ఖాళీలు: టెక్నీషియన్ అప్రెంటిసెస్ - 310.
- ✦ వ్యవధి: ఏడాది.
- ✦ విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్/ మెకానికల్ ఇంజినీరింగ్/ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్/ సివిల్ ఇంజినీరింగ్/ మెకానికల్ ఇంజినీరింగ్.
- ✦ అర్హత: సంబంధిత విభాగంలో (2015 తర్వాత) డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ వయసు: 1 ఆగస్టు 2017 నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు వయోపరిమితిలో మినహాయింపు లభిస్తుంది.
- ✦ స్టయిపెండ్: నెలకు రూ.4000 చెల్లిస్తారు.
- ✦ ఎంపిక: 21 ఆగస్టు నుంచి 31 ఆగస్టు వరకు నిర్వహించే ఇంటర్వ్యూల ఆధారంగా.
- ✦ ఇంటర్వ్యూ వేదిక: భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ డివిజన్, మైసూరు రోడ్, బెంగళూరు - 560026.
- ✦ అర్హులైన అభ్యర్థులు పూర్తి వివరాలతో ఇంటర్వ్యూకి హాజరుకావొచ్చు.

చివరి తేదీ: ***31 ఆగస్టు***

వెబ్‌సైట్: **www.bheledn.com**

ఇస్రోలో ఖాళీలు

మహేంద్రగిరి (తమిళనాడు)లో ఇస్రోకి చెందిన ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ ట్రేడ్ అండ్ టెక్నీషియన్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ మొత్తం ఖాళీలు: 139 (ట్రేడ్ అప్రెంటీస్ - 80, టెక్నీషియన్ అప్రెంటీస్ - 59)
- ✦ అర్హత: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్/ బ్రాంచ్‌లో ఐటీఐ/ ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ వయసు: 35 ఏళ్లకు మించకూడదు.
- ✦ ఎంపిక: అకడెమిక్ మెరిట్ ఆధారంగా.
- ✦ దరఖాస్తు: వెబ్‌సైట్‌లో సూచించిన నమూనాలో పూర్తి వివరాలు జత చేసి పంపాలి.
- ✦ చిరునామా: ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ), మహేంద్రగిరి, తిరునల్వేలి జిల్లా, తమిళనాడు

✦ చివరి తేదీ: ***2 సెప్టెంబరు***

✦ వెబ్‌సైట్: **www.iprc.gov.in**

ఐఐటీ, మద్రాస్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ మొత్తం ఖాళీలు: 32.
- ✦ రిజిస్ట్రార్ - 1.
- ✦ సిస్టమ్స్ ఇంజినీర్ - 1.
- ✦ సెక్యూరిటీ ఆఫీసర్ - 1.
- ✦ జూనియర్ ఇంజినీర్ - 3.
- ✦ స్టాఫ్ నర్స్ - 4
- ✦ జూనియర్ టెక్నీషియన్ - 12.
- ✦ జూనియర్ అసిస్టెంట్ - 10.
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్ దరఖాస్తులు 8 సెప్టెంబరు వరకు అందుబాటులో ఉంటాయి.
- ✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: 15 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.iitm.ac.in**

మరింత విద్యా ఉద్యోగ సమాచారం కోసం చూడండి..

www.eenadupratibha.net

ముఖ్యమైన తేదీలు

- ★ హార్టిసెట్ - 2017కు దరఖాస్తు చేయడానికి: *31* ఆగస్టు
- ★ ఇస్రోలో అప్రెంటీస్ ఖాళీలకు దరఖాస్తు చేయడానికి: *2* సెప్టెంబరు
- ★ దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డులోని ఖాళీలకు: *15* సెప్టెంబరు
- ★ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేయడానికి: *4* సెప్టెంబరు

ఇస్రోలో అప్రెంటీస్‌లు...

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు పలు విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ మొత్తం ఖాళీలు: 15116
- ✦ జూనియర్ ఇంజినీర్ (సివిల్ - 70, మెకానికల్ - 15)
- ✦ పట్వారీ - 140
- ✦ లీగల్ అసిస్టెంట్ - 13
- ✦ స్పెషల్ ఎడ్యుకేటర్ - 1540
- ✦ ప్రైమరీ టీచర్ - 4366
- ✦ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ - 496
- ✦ అసిస్టెంట్ టీచర్ (నర్సరీ - 320, ప్రైమరీ - 1394)
- ✦ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ - 919
- ✦ డ్రాయింగ్ టీచర్ - 295
- ✦ డొమెస్టిక్ సైన్స్ టీచర్ - 199
- ✦ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ): హోమ్‌సైన్స్ - 114, ఫిజికల్ ఎడ్యుకేషన్ - 160, ఫైన్ ఆర్ట్ - 30, మ్యూజిక్ - 1, బయాలజీ - 15, కెమిస్ట్రీ - 21, కామర్స్ - 28, ఎకనామిక్స్ - 32, ఇంగ్లిష్ - 156, హిందీ - 179, హిస్టరీ - 205, పొలిటికల్ సైన్స్ - 203, సంస్కృతం - 48, జాగ్రఫీ - 69, మ్యాథ్స్ - 20, ఫిజిక్స్ - 18, పంజాబీ - 3, ఉర్దూ - 2, అగ్రికల్చర్ - 1, సోషియాలజీ - 83.
- ✦ ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ): ఇంగ్లిష్ - 678, మ్యాథ్స్ - 610, నేచురల్ సైన్స్ - 416, సోషల్ సైన్సెస్ - 603, బెంగాలీ - 1, హిందీ - 422, పంజాబీ - 214, సంస్కృతం - 254, ఉర్దూ - 213.
- ✦ ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ గైడెన్స్ కౌన్సెలర్ - 432
- ✦ మ్యూజిక్ టీచర్ - 46
- ✦ దరఖాస్తు: 25 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
- ✦ ఎంపిక: రాతపరీక్ష (టైర్ - 1, టైర్ - 2) ఆధారంగా.

✦ చివరి తేదీ: ***15 సెప్టెంబరు***

వెబ్‌సైట్: **dsssonline.nic.in**

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ ఖాళీలు: రిస్క్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్స్ - 7 (క్రెడిట్ రిస్క్ - 3, ఆపరేషనల్ రిస్క్ - 2, మార్కెట్ రిస్క్ - 2)
- ✦ అర్హత: ఏదైనా డిగ్రీతోపాటు ఎంబీఏ/ సీఏ/ ఐసీడబ్ల్యూఏ
- ✦ వయసు: 30 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ✦ **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కింది పోస్టులను కూడా భర్తీ చేయనుంది.**
- ✦ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) - 1. సీఏ ఉత్తీర్ణతతోపాటు 15 ఏళ్ల అనుభవం అవసరం.
- ✦ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీవో) - 1. ఇంజినీరింగ్ డిగ్రీ లేదా ఎంసీఏ ఉత్తీర్ణులైనవారు అర్హులు. అనుభవం ఉండాలి.
- ✦ ప్రిన్సిపల్ - స్టాఫ్ ట్రెయినింగ్ కాలేజ్ - 1. ఎకనామిక్స్/ కామర్స్‌లో పీజీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంబీఏ (ఫైనాన్స్)/ పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం లభిస్తుంది.
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్ దరఖాస్తులు 2 సెప్టెంబరు వరకు అందుబాటులో ఉంటాయి.
- ✦ ఎంపిక: రాతపరీక్ష/ పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- ✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: 12 సెప్టెంబరు
- ✦ చిరునామా: ది అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఐఆర్ అండ్ హెచ్‌ఆర్‌డీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లోక్‌మంగల్, 1501, శివాజీ నగర్, పుణె - 411 005

✦ వెబ్‌సైట్: **www.bankofmaharashtra.in**

టీచింగ్ పోస్టులు

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ మొత్తం ఖాళీలు: 16
- ✦ టీచింగ్ - 9. ప్రొఫెసర్ - 1, అసోసియేట్ ప్రొఫెసర్ - 3, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 5

అర్హత: 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీతోపాటు పీహెచ్‌డీ, బోధన/ రిసెర్చ్‌లో అనుభవం అవసరం.

నాన్ టీచింగ్ పోస్టులు: 7

- ✦ సైకియాట్రిక్ సోషల్ వర్కర్ - 1, డేటా ఎంట్రీ ఆపరేటర్ - 1, స్టెనోగ్రాఫర్ - 5.
- ✦ ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా.
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

✦ చివరి తేదీ: ***31 ఆగస్టు***

వెబ్‌సైట్: **www.tiss.edu**

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ ఖాళీలు: 36
- ✦ మేనేజ్‌మెంట్ ట్రెయినీ (హెచ్‌ఆర్) - 12. అర్హత: 60 శాతం మార్కులతో ఎంబీఏ/ పీజీ డిగ్రీ లేదా పర్సనల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/ హెచ్‌ఆర్ లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ మేనేజ్‌మెంట్ ట్రెయినీ (మార్కెటింగ్) - 24. అర్హత: 60 శాతం మార్కులతో ఎంఎస్సీ (అగ్రికల్చర్) లేదా తత్సమాన అర్హత అవసరం. లేదా మార్కెటింగ్/ అగ్రి బిజినెస్ మార్కెటింగ్/ ఇంటర్నేషనల్ మార్కెటింగ్/ రూరల్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ/ పీడీడీబీఎం ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.
- ✦ ఎంపిక: ఆన్‌లైన్ రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.

✦ చివరి తేదీ: ***6 సెప్టెంబరు***

వెబ్‌సైట్: **www.nationalfertilizers.com**

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 224 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ అగ్రికల్చర్ - 186 (6 లైబ్రరీ సైన్స్ పోస్టులతో కలిపి).

అర్హత: అగ్రికల్చరల్ ఎకనామిక్స్/ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్/ అగ్రికల్చరల్ మైక్రోబయాలజీ/ ఆగ్రోనమీ/ క్రాప్ ఫిజియాలజీ/ ఎంటమాలజీ/ జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్/ హార్టికల్చర్/ ప్లాంట్ పాథాలజీ/ ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ/ సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీ/ స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమెటిక్స్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ, కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)లో అర్హత సాధించి ఉండాలి.

లైబ్రరీ సైన్స్ పోస్టులకు లైబ్రరీ సైన్స్/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ డాక్యుమెంటేషన్ సైన్స్‌లో 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత అవసరం.

- ✦ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ - 22, హోమ్‌సైన్స్ - 16.
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో 20 సెప్టెంబరు వరకు.

✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: **29 సెప్టెంబరు**

- ✦ **హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ బ్యాక్‌లాగ్ (ఎస్సీ, ఎస్టీ) పోస్టులను కూడా భర్తీ చేయనుంది.**
- ✦ ఖాళీలు: అగ్రికల్చర్ - 10, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ - 5, హోమ్ సైన్స్ - 3
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో 12 సెప్టెంబరు వరకు.



✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: ***29 సెప్టెంబరు***

వెబ్‌సైట్: **www.pjtsau.ac.in**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ ఖాళీలు: అసిస్టెంట్ ప్రొఫెసర్లు (బ్యాక్‌లాగ్ - 178, రెగ్యులర్ - 20)
- ✦ విభాగాలు: అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్.
- ✦ అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, ఎండీఎస్, డీఎం, ఎంసీహెచ్, డీఎన్‌బీ, పీహెచ్‌డీ లేదా తత్సమాన అర్హత అవసరం.
- ✦ వయోపరిమితి: 1 జులై 2017 నాటికి 40 సంవత్సరాలకు మించకూడదు.
- ✦ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

✦ చివరి తేదీ: ***4 సెప్టెంబరు***

వెబ్‌సైట్: **dme.ap.nic.in**

ప్రవేశాలు

హార్టిసెట్ - 2017

హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చరల్ యూనివర్సిటీ 2017 - 18 విద్యాసంవత్సరానికి బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో ప్రవేశానికి నిర్వహించే 'హార్టిసెట్ - 2017' కు నోటిఫికేషన్ విడుదల చేసింది.


- ✦ సీట్ల సంఖ్య: 23.
- ✦ అర్హత: హార్టికల్చర్ డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ వయసు: 31 డిసెంబరు 2017 నాటికి 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్నవారై ఉండాలి.
- ✦ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ✦ పూర్తి చేసిన దరఖాస్తుకు కంప్ట్రోలర్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, రాజేంద్రనగర్, హైదరాబాద్ పేరిట చెల్లేలా తీసిన రూ.750 డీడీ (ఎస్సీ/ ఎస్టీ/ పీహెచ్ అభ్యర్థులు రూ.350) జత చేసి పంపాలి.
- ✦ పరీక్ష తేదీ: 18 సెప్టెంబరు

✦ చివరి తేదీ: 31 ఆగస్టు

వెబ్‌సైట్: **www.skltshu.ac.in**

హాయ్! బుజ్జీ!!

2034లో మీ దగ్గరా చూడొచ్చు!



◆ హాయ్... సూర్యుడు గారూ! నాపేరు కిట్టూ! హాయ్‌బుజ్జీ తరఫున మిమ్మల్ని సరదాగా పలకరిద్దామని వచ్చా. 'నా గురించి తెలియనిదేముందబ్బా?' అనుకుంటున్నారేమో కానీ మరేమీ లేదు.. రెండు మూడు రోజులుగా అంతా మీ సంగతులే మాట్లాడుతున్నారు... అమెరికాలో, ప్రసార మాధ్యమాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం అంటూ హల్‌చల్ నడిచింది. అవునుగానీ ఇంతకీ మీరు మా దగ్గర ఇలా ఎప్పుడు కనిపిస్తారేంటి?

▶▶ నన్ను కలవడానికి వచ్చినందుకు చాలా సంతోషం కిట్టూ. మీ దగ్గర నా సంపూర్ణ సూర్యగ్రహణం చూడాలంటే 2034 వరకు ఆగాల్సిందే. లేదంటే 2019లో దక్షిణ అమెరికా దేశాల దగ్గర కనిపిస్తానిలా. అప్పటిలోగా నా గ్రహణం గురించి మీ శాస్త్రవేత్తలేమైనా కొత్త విషయాలు తెలుసుకుంటారేమో చూద్దాం.

◆ అవును నాకూ ఉత్సాహంగానే ఉంది. అది సరే... మరి ఇప్పటి సూర్యగ్రహణం సంగతులు ఏంటి?

▶▶ ఆ విషయానికే వస్తున్నా. కానీ ఇంకాస్త దూరంగా నిలబడు! లేదంటే నా వేడిని తట్టుకోలేవు. భూమికీ, నాకూ మధ్య చంద్రుడు వచ్చినప్పుడు, మీ భూమిపై కొంత భాగంలో నేను కనిపించను. దాన్నే సూర్యగ్రహణం అంటారని వినే ఉంటావుగా. అత్యంత ప్రకాశవంతంగా వెలిగే నేను చంద్రుడి ఛాయ వల్ల ఒక సన్నటి అంచులా కనిపిస్తా. అప్పుడు ఆ ప్రదేశంలో మాత్రం సూర్యగ్రహణం కనిపిస్తుంది. ఇప్పుడు అమెరికాలో జరిగింది అచ్చంగా ఇదేనన్నమాట.

◆ అయితే ఈసారి వచ్చిన సంపూర్ణ గ్రహణం దాదాపు 99 ఏళ్ల తర్వాత ఏర్పడిందటగా. పసిఫిక్ తీర ప్రాంతం నుంచి అట్లాంటిక్ తీరం వరకు మీ గ్రహణం వల్ల చీకటి పడటం చాలా అరుదైన విషయమంటూ మా శాస్త్రవేత్తలూ చెబుతున్నారు. ఎప్పుడో 1918లో ఇలాంటి గ్రహణం కనిపించిందట. మళ్లీ ఇన్నాళ్లకు ఇలా. అందుకే దీనికి 'గ్రేట్ అమెరికన్ ఎక్లిప్స్' అంటూ పేరూ పెట్టేశారు.

▶▶ అవును కిట్టూ. అమెరికా ఒరెగాన్ నుంచి దక్షిణ కరోలినా వరకు 14 రాష్ట్రాల మీదుగా 98 కిలోమీటర్ల నుంచి 113 కిలోమీటర్ల మేర నాకు చంద్రుడు అడ్డొచ్చాడు. ఈ తతంగమంతా 2 గంటల 40 నిమిషాల పాటు జరిగింది. అందుకే ఆ ప్రాంతమంతా పట్టపగలే రెండు మూడు నిమిషాలు చీకటయ్యింది. అప్పుడు నా గ్రహణాన్ని చూడ్డానికి భారీ ఏర్పాట్లే జరిగాయనుకుంటా!

◆ అవునవును. సోమవారం అమెరికాలో అన్ని చోట్లా ఒకటే సందడి. అమెరికాలో కొన్ని చోట్ల పాక్షికంగా కనిపిస్తే కొన్ని రాష్ట్రాల్లో మాత్రం సంపూర్ణంగా గ్రహణం కనిపించింది. నేను నేరుగా చూడలేదు కానీ నాసా వాళ్లు అందించిన ప్రత్యేక ప్రసారాల్లో చూశా. విద్యార్థులకు అంతరిక్షం విషయాలు పుస్తకాల్లోనే తప్ప నిజంగా చూపించడానికి కుదరదు కదా. కానీ ఈ సందర్భంగా ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌ఫార్మల్ స్టెమ్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ లాంటివి పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. కళ్లకు హాని జరగకుండా ఉండేందుకు కళ్లజోళ్లు ఇచ్చి నేరుగా సూర్యగ్రహణాన్ని దగ్గరుండి చూపించాయి. కొన్ని మ్యూజియాల్లో వారి కోసం గ్రహణంపై తరగతులు నిర్వహించాయి. టెలిస్కోపులిచ్చి, దాంట్లోంచి గ్రహణాన్ని చూపిస్తూ వివరాలు చెప్పుకొచ్చాయి. ఇదంతా భలేగా సాగిపోయింది.

▶▶ శాస్త్రవేత్తలు కూడా చాలా ఆసక్తి చూపినట్టున్నారే!

◆ అవును మరి. అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం నాసా వారైతే మరీనూ. ఏదో రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్ పెట్టినట్లు మీ గ్రహణానికీ పెట్టి ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇక చాలామంది శాస్త్రవేత్తలైతే ఆ సమయంలో మిమ్మల్నీ, చంద్రుడినీ టెలిస్కోపుల ద్వారా ఎంతో పరీక్షగా చూశారు. దాన్నుంచి వాళ్లు నేర్చుకునే విషయాలు మీపై చేసే పరిశోధనల్లో ఎంతో ఉపయోగపడతాయని చెబుతున్నారు వాళ్లు.

మరో విషయం చెప్పడం మరిచా. మీ గ్రహణాన్ని నేల మీద నుంచే కాదు. విమానాల్లోంచి, సముద్రంలో ఓడల మీద నుంచి కూడా చూశారు కొంత మంది. ఇక వస్తా సూర్యుడు గారూ! ఈ కబుర్లన్నీ మా వాళ్లకీ చెప్పాలి కదా!

▶▶ సరే కిట్టూ. బైబై మరి!

అందం చూసే కళ్లలో ఉండదు, సాయం చేసే చేతుల్లో ఉంటుంది

- అబ్దుల్ కలాం

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Protection = రక్షణ
- మనోజ్ఞం = అందం

నవ్వుల జల్లులు!



టీచర్: కళ్లు, ముక్కు, చెవులు ఎందుకు ఉపయోగపడతాయి?

బిట్టు: కళ్లద్దాలు పెట్టుకోవడానికి టీచర్!

- జి. వెంకట రమణ, తూర్పునాయుడుపాలెం



టీచర్: రాముా! పిల్లుల జాతికి చెందిన జంతువుల పేర్లు చెప్పు?

రాము: తల్లి పిల్లి, తండ్రి పిల్లి, పిల్లి పిల్లలు టీచర్!

- పి. నారాయణ, అనంతపురం

ప్రశ్నలోనే సమాధానం!

ఇక్కడున్న ఆంగ్ల పదాల్లోనే దాని పక్కనున్న తెలుగు పదాల సమానార్థకాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టండి.

1. Boxలో ఎద్దు ☐☐
2. Beatలో తిను ☐☐☐
3. Teamలో తేనీరు ☐☐☐
4. Stageలో వయసు ☐☐☐
5. Priceలో మంచు ☐☐☐
6. Partలో కళ ☐☐☐
7. Phoneలో ఒకటి ☐☐☐
8. Earthలో చెవి ☐☐☐

- ఎస్. మణెమ్మ, కాజీపేట

పట్టికలో పదాలు

P	F	I	E	S	P	D	T	B	N	L	P
C	E	T	U	J	T	H	R	I	I	N	Q
J	K	N	A	R	D	H	A	E	B	H	J
H	E	F	M	S	A	T	U	R	N	B	I
V	I	M	M	L	F	N	E	M	A	U	I
Y	G	F	E	N	O	T	U	H	N	Z	K
U	I	I	R	E	I	W	T	S	P	M	G
M	S	Q	C	P	H	C	R	W	M	E	F
A	P	L	U	T	O	A	M	S	E	L	A
S	O	J	R	U	M	M	D	E	A	R	M
D	I	A	Y	N	R	X	H	G	M	D	X
R	E	E	P	E	O	F	B	N	H	O	O

ఇక్కడి పదాలు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి

MERCURY, VENUS, EARTH, MARS, JUPITER, SATURN, URANUS, NEPTUNE

చుక్కలు కలపండి



చిలిపి ప్రశ్న

నూతిలో ఉన్న పది కప్పల్లో తొమ్మిది చచ్చిపోతే ఇంక ఎన్ని ఉంటాయి?

- జి. రమేష్, పెనుబర్తి

జవాబులు: **బొమ్మలో ఉన్నవే:** Xantus, Xerus, Xray, Xiphias, X ray fish **చిలిపి ప్రశ్న:** పదీ అందులోనే ఉంటాయి! **ప్రశ్నలోనే సమాధానం:** 1. Ox 2. Eat 3. Tea 4. Age 5. Ice 6. Art 7. One 8. Ear



బొమ్మలో ఉన్నవే

బొమ్మలో X ఆంగ్ల అక్షరంతో మొదలయ్యే అంశాలున్నాయి. అవేంటో పట్టుకుని గడుల్లో రాయగలరా?

X



ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగుల నిరసన

అనంత గ్రామీణం (తపోవనం), న్యూస్‌టుడే: ఏడీసీసీ బ్యాంకు లావాదేవీలపై విచారణను ఆపాలని కోరుతూ మంగళవారం బ్యాంకు ప్రధాన కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యాంకు ఉద్యోగుల రాష్ట్ర నాయకుడు సుఖదేవబాబు, జిల్లా నాయకుడు అనంత పద్మనాభం, వివిధ శాఖల ఉద్యోగులు హాజరై నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర సహకార రిజిస్ట్రార్ దురుద్దేశంతో నియమించిన విచారణను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న డీసీఓ కార్యాలయం ముందు నిర్వహించే మహా ధర్నాకు హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు.

శిక్షణతో ఎంతో ప్రయోజనం

జిల్లా వ్యవసాయం, న్యూస్‌టుడే : నిరుద్యోగ యువతకు శిక్షణ వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని సూక్ష్మసాగునీటి పథక సంచాలకులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు బిందుసేద్యం పరికరాలు అమర్చుటపై నిర్వహించిన శిక్షణ కాలం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సూక్ష్మసేద్యం పరికరాలు జిల్లాలో పెద్ద ఎత్తున వినియోగించుకుంటున్నారు. దానిపై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తోంది. అయితే పరికరాలు మంజూరైన వాటి అమరికలో తగిన సిబ్బంది లేక జాప్యం చేస్తున్నారన్నారు. జాప్యాన్ని నివారించేందుకు జిల్లాలో 120 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. రెండు బృందాలకు 60 మందికి శిక్షణ పూర్తి చేసి, ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీలు చంద్రశేఖర్, విజయశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న పీడీ వెంకటేశ్వర్లు తదితరులు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: వ్యాపారాభివృద్ధికి బుధవారం గణపతిని ఎలా పూజించాలి?, చిత్రపటాలు అదృష్టాన్నిస్తాయా?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: సామాన్యుడు (జగపతిబాబు, కామ్నజెత్మాలని).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': మసాలా వంటలు 'చికెన్ మంచూరియా', 'కీమా ఫ్రై', కారం కారంగా 'క్రాబ్స్ పెప్పర్ ఫ్రై', చెఫ్స్ స్పెషల్ 'ప్రాన్స్ పకోడీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి-2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సాటైం (రిపీట్), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఢీ 10: సూపర్ డాన్సుల సుప్రీమ్ షో...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 మహాతల్లి రిపీట్

01:15 ఫ్రూట్స్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 పోవే..పోరా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 నా షో నా ఇష్టం

09:00 పటాస్

09:30 అల్లరే అల్లరి

10:00 సరదాగా కాసేపు

10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)

★ డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)

★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)

★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)

★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)

★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)

★ ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)

★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (ఉ. 9:30, సా. 4:00)

★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (ఉ. 10:00)

★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)

★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (మ. 2:00, రా. 7:00)

★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (మ. 2:30, రా. 09:30).

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: జీవనజ్యోతి (జయసుధ), 10-00: మార్నింగ్ షో: భార్యాభర్తల బంధం (బాలకృష్ణ, రజని), మధ్యాహ్నం: 1-00: మాటినీ: మువ్వగోపాలుడు (బాలకృష్ణ, విజయశాంతి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: జనం (సాయికుమార్), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దలు మారాలి (కృష్ణ, జమున), 10-00 సెకండ్ షో: అగస్టు 15 రాత్రి (అర్జున్, గౌతమి).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ శాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ బేసిల్ క్రేప్స్ & సొరకాయ తెలగపిండి రైస్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – వెన్న చెక్కలు & మొక్కజొన్న బూరెలు, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – టమోట కోకోనట్ సూప్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (వృద్ధ వయసు వారికోసం) – క్యాబేజి చట్నీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - వంకాయ పప్పు & వంకాయ రోటి పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - పటిస్టప (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఆలూ పన్నీర్ బైట్స్, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - దొండకాయ చట్నీ అవకాడొ చపాతీ రోల్, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - బట్టర్ గార్లిక్ పెప్పర్ ప్రాన్స్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (జపాన్ స్పెషల్)– జపనీస్ ఫిష్ సూప్ & ప్రాన్స్ అండ్ ఫిష్ క్యాబేజి, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - స్ప్రౌట్స్ గోకరకాయ కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – చాక్లెట్ కప్ కేక్స్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – సెజ్వాన్ చిల్లీ నూడుల్స్, మ.2.30: చోటా షెఫ్ – చికెన్ విత్ ఎగ్ ఫ్రై, మ.3.00: పదండి విందుకు – ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.5.15: స్నాక్స్ - బ్రెడ్ దహీ వడ.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: **శ్రీ పద్మనాభ స్వామి ఆలయం, పద్మనాభం, విశాఖపట్నం,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి(రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30తీర్థయాత్ర: **శ్రీహరిహరక్షేత్రం, కర్మన్‌ఘాట్, హైదరాబాద్, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీ భవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360^{0}, 09-00 ప్రతిధ్వని, **09-30 యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 23-08-2017

ఉదయం: 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (సహస్ర కలశాభిషేకం), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయె - వినాయకుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు-కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కళ్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 అష్టగణపతితత్వం, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 భక్తి చైతన్యం, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 ఆలయదర్శనం - త్రివిక్రమాలయం, 09-30 దేవీసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం.

ఉదయం: 06-00 శ్రీవిష్ణు సహస్రం, 06-30 గోవింద నామాలు, 7-00 అర్చన, 7-30 శ్రీవేంకటేశ్వరస్తోత్రం, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 వినాయక వైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీవేంకటేశ్వరస్తోత్రం, 05-30 గోవిందనామాలు, 06-00 శ్రీవిష్ణుసహస్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 గణేశాయ నమః. 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తి విశేషాలు.

ఉదయం: 07-30 గోపురం, 08-00 సినిమా: భీమవరం బుల్లోడు, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: జై చిరంజీవా.

ఉదయం: 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: సీతారామరాజు, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: పెళ్ళిసందడి, **సాయంత్రం:** 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

ఉదయం: 06-00 టెలిషాపింగ్ 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: శీను, 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి 02-30 నాగిని 2 రిపీట్, 03-00 సినిమా: **గోలిమార్,** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 10-00 సినిమా: కరెంట్ తీగ.

ఉదయం: 06-16 ప్యాసింజర్ 57, 07-43 ఫైనల్ డెస్టినేషన్ 5, 09-25 ఫూల్స్ గోల్డ్, 11-28 స్టెప్ అప్, మధ్యాహ్నం: 01-21 ది తక్సెడో, 03-03 జాక్ ది జయింట్ స్లేయర్, సాయంత్రం: 05-11 ఘోస్ట్ రైడర్: స్పిరిట్ ఆఫ్ వెంగెన్స్, 06-55 10000 బీసీ, రాత్రి: 09-00 గెట్ స్మార్ట్, 11-03 ఘోస్ట్ షిప్.

జీవన ఎరువులతో ప్రయోజనాలు

నేలలో ఉన్న పోషకాలను మొక్కలకు అందించేందుకు దోహదపడే వాటిని జీవన ఎరువులు అంటారని కొత్తచెరువు వ్యవసాయ అధికారి సతీష్‌బాబు తెలిపారు.

జీవన ఎరువుల్లో నేలకు, పంటలకు మేలు చేసే కోట్లాది సూక్ష్మజీవులు ఉంటాయి. ఈ సహజ ఎరువులను ఉపయోగించడం సులువు. కాలుష్యం ఉండదు. పంటకు, భూమికి ఎలాంటి హాని కలిగించవు. సేంద్రియ ఎరువుల కొరత, రసాయన ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న పరిస్థితుల్లో జీవన ఎరువుల ప్రాధాన్యం రోజు రోజుకు పెరుగుతోంది. జీవన ఎరువుల వాడకంతో నేలలో సూక్ష్మజీవుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతాయి. దీంతో నేల ఆరోగ్యం, పంట దిగుబడి, నాణ్యత అధికమవుతాయి.



జీవన ఎరువులు – రకాలు: జీవన ఎరువులు రెండు రకాలు. నత్రజనిని స్థిరీకరించేవి. భాస్వరాన్ని మొక్కలకు అందుబాటులోకి తెచ్చేవి. రైజోబియం, అజటోబాక్టరు, అజోస్పైరిల్లం, అసిటోబాక్టరు, ఆల్గే, అజొల్లాలు నత్రజనిని అందించే వాటిలో ప్రధానమైనవి. వీటిని వరి, వేరుసెనగ, పప్పుజాతి పంటల్లో ఉపయోగించడం వల్ల 30శాతం రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చు. భాస్వరాన్ని అందించడానికి ఫాస్ఫోబాక్టీరియా, మైకోరైజా జీవన ఎరువులు పనిచేస్తాయి. మైకోరైజా రకాలు నేలలో స్థిరంగా ఉండే భాస్వరాన్ని మొక్కల వేర్లకు అందిస్తాయి. సూక్ష్మజీవులు, శిలీంద్రాలు భాస్వరాన్ని కరిగించి, మొక్కలకు ఈ పోషకాన్ని అందుబాటులోకి తీసుకువస్తాయి. జీవన ఎరువులను అన్ని రకాల నేలలకు ఉపయోగించవచ్చు.

పంట నాణ్యత, రుచి కూడా పెరుగుతుంది. నత్రజని, భాస్వరం జీవన ఎరువుల వినియోగంతో అధిక ప్రయోజనం ఉంటుంది. నీలి ఆకుపచ్చనాచు నాలుగు కిలోలు, 100 కిలోల అజొల్లాను ఎకరా వరి పొలంలో నేరుగా వెదజల్లాలి. ఇవి చేలో వృద్ధి చెంది, పంటకు అవసరమైన నత్రజనిని అందిస్తాయి. రైజోబియం, అజటోబాక్టరు, అజోస్పైరిల్లం, అసిటోబాక్టరు కల్చరును విత్తనశుద్ధికి, సేంద్రియ ఎరువులో కలుపుకుని దుక్కిలో వెదజల్లాలి. భాస్వరపు జీవన ఎరువులైన ఫాస్ఫోబాక్టీరియా, మైకోరైజాలను రెండు కిలోల చొప్పున పశువుల ఎరువులో కలిపి చల్లితే మొక్కకు అవసరమైనపుడు, భాస్వరం అంది రోగకారకాల ప్రవేశాన్ని నిరోధిస్తుంది.

జీవన ఎరువుల ఉపయోగంలో జాగ్రత్తలు: జీవన ఎరువులను వేడి, వెలుతురు ఉన్న ప్రదేశాల్లో కాకుండా చల్లని ప్రదేశాల్లో ఉంచాలి. రసాయక ఎరువులు, పురుగు మందులతో కలిపి వాడకూడదు. విత్తనశుద్ధి చేయాలనుకుంటే.. మొదట శిలీంద్ర నాశనులతో శుద్ధిచేసిన 24 గంటల తరువాత విత్తనానికి జీవన ఎరువులను పట్టించాలి. జీవన ఎరువుల ప్యాకెట్లపై ముద్రించిన గడువు లోపు వాటిని వినియోగించాలి. గడువు దాటిని జీవన ఎరువులను ఉపయోగించకూడదు.

– న్యూస్‌టుడే, కొత్తచెరువు

సీతాఫలం సాగు వివరాలు

సీతాఫలం ప్రధానంగా ఉష్ణమండల పంట. ఎక్కువ వర్షపాతాన్ని, వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుంది. పుష్పించే దశలో పొడి వాతావరణం, కాయ ఏర్పడే దశలో అధిక తేమ, 50-75 సెం.మీ. వర్షపాతం సీతాఫలం పంటకు అనుకూలం. చౌడు, క్షార గుణం కలిగిన నేలల్లో మినహా అన్ని రకాల నేలల్లోనూ సాగు చేయవచ్చు. మురుగునీరు పోయే సదుపాయం కలిగిన చల్కా, గరప, ఎర్ర నేలలు, రాళ్లతో కూడిన కంకర నేలలు సైతం సీతాఫలం సాగుకు అనుకూలం.

మొక్కలు నాటే విధానం: 60×60 ×60 సెంటీమీటర్ల పరిమాణంలో 5×5 మీటర్ల దూరంలో గుంతలు తవ్వాలి. ఒక్కో గుంతకు 20 కిలోల పశువుల ఎరువు, కిలో సూపర్‌ఫాస్ఫేట్, 100 గ్రాముల ఫాలిడాల్‌ను పొడిగుంత నుంచి తీసిన పైపొర మట్టిలో కలిపి గుంతను నింపాలి. అంటు మొక్కలను గుంత మధ్యలో నాటాలి. నాటేటప్పుడు అంటుభాగం భూమికి 15-20 సెం.మీ. పైకి ఉండేలా నాటి, మొక్కకు ఊతంగా కర్రను ఏర్పాటు చేయాలి. అంటు మొక్కల వేరుమూలంపై వచ్చే చిగుళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. సీతాఫలంలో లేత కొమ్మల మీద పూత వస్తుంది. కనుక తక్కువ స్థాయిలో కొమ్మల కత్తిరింపు చేస్తే లేత కొమ్మలు, పూత బాగావచ్చి ఎక్కువ దిగుబడి వస్తుంది. కొమ్మల కత్తిరింపు జనవరి-మార్చి మాసాల్లో, ఆకురాల్చే సమయంలో చేయాలి. అడ్డదిడ్డంగా ఉన్న కొమ్మలను కత్తిరించాలి.

★ మొక్కలు నాటిన తర్వాత అవసరాన్ని బట్టి 2-3 రోజులకు ఒకసారి నీరు పారించాలి. నీరు తక్కువైతే కాయలు గట్టిగా మారి త్వరగా పండుబారతాయి. బెట్టలో మొక్కల మొదళ్లలో వరిపొట్టు, వేరుసెనగ పొట్టులాంటివి వేసి పాదుల్లో తేమను నిలుపుకోవచ్చు.

★ కాపులో ఉన్న ఒక్కో చెట్టుకు 50 కిలోల పశువుల ఎరువు, కిలో ఆముదపు పిండి, కిలో ఎముకల పొడిని మొదళ్ల చుట్టూ గాడిచేసి జూన్-జులై మాసాల్లో వేయాలి. వీటితోపాటు 250 గ్రాములు నత్రజని, 125 గ్రాములు భాస్వరం, 125 గ్రాములు పొటాష్ వేసుకోవచ్చు.


పామిడిలో మట్టితో విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు

పామిడి: పట్టణంలోని కృష్ణవేణి ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో డైరెక్టర్ మౌళిక అధ్యక్షతన 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు.


మట్టితో తయారుచేసిన విగ్రహాలతో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

మట్టితో చేద్దాం.. మనసుతో పూజిద్దాం..

నీటి కాలుష్యాన్ని నివారిద్దాం.. పర్యావరణ పరిరక్షణను కాపాడుదాం


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి

రొద్దం: స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను తయారు చేయడంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.


తీర్చిదిద్దిన గణేశుడి ప్రతిమలు

సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం. అలాంటి నీటిలో వివిధ రకాల రంగులతో తయారుచేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీరు కాలుష్యమవుతున్నాయి. దీంతో నీటిలో ఉంటున్న జీవరాశులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అందువల్ల ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారుచేసిన విగ్రహాలను నిషేధించి మట్టితో తయారుచేసిన విగ్రహాలను ప్రతిష్ఠిస్తే పర్యావరణానికి మేలు. పూజల అనంతరం నిమజ్జనం చేసినా సమస్త జీవరాశులకు ఎలాంటి హాని జరగదు. అందుకే ఆలోచించండి.. మట్టితో చేద్దాం.. మనసుతో పూజిద్దాం.


శిక్షణ ఇస్తున్న కళాకారుడు

ముదిగుబ్బ (బత్తలపల్లి): ముదిగుబ్బలోని పీవీఎస్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో కరస్పాండెంట్ పీవీ నాయుడు ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాల తయారీని కళాకారుడు బ్రహ్మయ్య విద్యార్థుల సమక్షంలో చేసి చూపించారు. అనంతరం వాటి ప్రయోజనాలను వివరించారు.


ప్రతిమలను పంపిణీ చేస్తూ..


ఉత్సవ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సమితి నాయకులు

24 నుంచి
వెండి వినాయకుడి ఉత్సవాలు


64 కిలోల వినాయకుడి విగ్రహం

మెయిన్‌రోడ్డు (గుంతకల్లు), న్యూస్‌టుడే : ప్రపంచంలోనే అతిబరువైన వెండి వినాయకుడి విగ్రహాన్ని తయారు చేసిన ఘనత గుంతకల్లు పట్టణానికి చెందిన ఆవోపా వినాయక ఉత్సవ సేవాసమితి అధ్యక్షుడు పువ్వాడి శ్రీనివాసులు, కార్యదర్శి రఘునాథగుప్తా, సహాయ కార్యదర్శి గుంతా రమేష్ పేర్కొన్నారు. సమితి ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే వెండి వినాయకుడి పుస్తకాన్ని సమితి నాయకులు మంగళవారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వారు మాట్లాడారు. 1996లో పూర్తిగా వెండికలిగిన 64 కిలోల బరువైన విగ్రహాన్ని తయారు చేసినట్లు తెలిపారు. ఇంత బరువైన విగ్రహాన్ని ప్రపంచంలో ఎక్కడా తయారు చేయలేదన్నారు. బ్యాంకు లాకరులో ఉన్న విగ్రహాన్ని 24న తీసుకొచ్చి పువ్వాడి చంద్రశేఖర్ ఇంట్లో ఉంచి పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం ఊరేగింపుగా విగ్రహాన్ని తీసుకెళ్లి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రజలు దర్శించుకోవడానికి ఉంచనున్నామని వివరించారు. నాలుగు రోజులపాటు ఆలయంలో వెండి వినాయకుడికి పూజలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో మట్టి వినాయకుడిని ఉంచుతామని వివరించారు.


సంప్రదాయ దుస్తుల్లో కేరళ విద్యార్థినులు


తాడు లాగుతూ...

ఓనం వేడుక అదరహో!

అలరించిన కేరళ విద్యార్థినులు


ఉత్సవాలను ప్రారంభిస్తున్న గైనకాలజిస్టు బాలాకుమారి

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ఓనం.. కేరళ సంప్రదాయ పండగ. ఏటా సెప్టెంబరు 5న వైభవంగా జరుపుకొంటున్నారు. అనంతపురంలో ఈ పండగ ముందే వచ్చింది. శ్రీసాయి బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో కేరళ విద్యార్థినులు అధిక సంఖ్యలో ఉన్నారు. దీంతో మంగళవారం ముందస్తుగా కళాశాల కరస్పాండెంట్, గైనకాలజిస్టు బాలాకుమారి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించారు. కేరళ కళలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఓనం విశిష్టతను నృత్యరూపకం ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా పలు సినీ గేయాలకు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఉట్టి కొట్టడం, తాడు లాగడం వంటి ఆటలు ఆడారు. ఆంధ్ర, మణిపూర్, జార్ఖండ్ రాష్ట్రాల విద్యార్థినులు సైతం భాగస్వాములు అయ్యారు. కళాశాల అధ్యక్షుడు శంకరయ్య, ప్రిన్సిపల్ అమృతవల్లి, ఏఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.